**విలేకరులు కావలెను**

చట్టం మీ చుట్టం జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే **చట్టం మీ చుట్టం** దినపత్రికకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్

9581419999

**చట్టం** మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

## రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

### పరిశీలన అనంతరం సంతకం చేసే అవకాశం



**న్యూఢిల్లీ,ఏప్రిల్6( చట్టం న్యూస్ ):** రాజధాని అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లు–2026..

మిగతా 2వ పేజీలో..

సంపుటి : 14 ● సంచిక : 84 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi మంగళవారం 7 ఏప్రిల్ 2026 ● పేజీలు : 8 ● వెల 2/-

# నీటిని దాచుకోవడం నేర్చుకోవాలి

- భూమిలో నీరు ఇంకితేనే సేద్యానికి సాధ్యం
- నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలి
- నీటి భద్రతలో రైతులు భాగస్వామ్యం కావాలి
- గతంలో ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు చేపట్టాం
- మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- 'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత'లో సిఎం చంద్రబాబు
- మావిగన్ పేరుతో అమరావతిని అడ్డుకునే కుట్రలు అంటూ విమర్శలు




**అనంతపురం,ఏప్రిల్ 6 ( చట్టం న్యూస్ ) :** బ్యాంక్‌లో నగదు దాచుకున్నట్లు మనం నీటిని భూమిలో దాచుకోవాలని రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలని సీఎం చంద్రబాబు కోరారు. భూమినే ఒక జలాశయంగా మార్చుకోవాలన్నారు. అనంతపురం జిల్లా యాడికిలో చంద్రబాబు పర్యటించారు. 'నీటి భద్రత– సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగునీటి సంఘాలు, రైతులతో సమావేశమయ్యారు. వర్షపు నీటి విలువ రాయలసీమ రైతులకు బాగా తెలుసని అన్నారు. నీటిని సంరక్షించుకోవడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని స్పష్టం చేశారు. పరిగెత్తే నీటిని నిలబెట్టాలి.. నిలబడిన నీటిని నిల్వ చేయాలి.. జలాశయాలు నింపేందుకు ప్రయత్నించాలన్నారు. ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం వంటివి గతంలో చేపట్టామని చంద్రబాబు వివరించారు. నీటి కుంటలు, కాలువలు, చెరువుల్లో మట్టి తీసి పొలాల్లో వేశామని ఏపీ సీఎం గుర్తు చేశారు. నీటి భద్రతా కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని రైతులు, సాగునీటి సంఘాలకు సూచించారు. మైక్రో ఇరిగేషన్‌లో తాము చేసింది.. దేశం మొత్తం అనుసరించిం దని అన్నారు. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తూ దేశంలో నంబర్ వన్‌గా ఉన్నామన్నారు. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు–మీరు, నీరు ప్రగతి తీసుకువచ్చాం. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. రాయలసీమలో 63 శాతం పంటలను మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకొచ్చాం. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ వల్ల రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా తయారైంది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీటిని నిల్వ చేసుకుంటే చాలు.. అదే సంపద సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే.. ప్రస్తుతం అవి 11 మీటర్లే ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం కంటే ముందు 6 మీటర్ల లోతు, ఆ తర్వాత 3 మీటర్ల కంటే తక్కువగా నీరు చూడాల్సి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అలా చేయగలిగితే రాష్ట్రంలో నీటి ఎద్దడి అనేది ఉండదన్నారు. రాయలసీమలోనూ ప్రతీ ఎకరాకు నీరు ఇచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 2వ పేజీలో..

## గ్యాస్ కొరతతో హోటల్ పరిశ్రమ కుదేలు

### వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
### ప్రైవేట్ హోటల్స్ అసోసియేయన్ విజ్ఞప్తి



**విజయవాడ,ఏప్రిల్6 ( చట్టం న్యూస్ ):** పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు రాష్ట్రంలోని హాస్పిటాలిటీ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా స్టార్ హోటల్ విభాగంపై ప్రభావం చూపుతోందని ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు ఆష ప్రెసిడెంట్ ఆర్‌వి.స్వామి ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం గ్లోబల్ స్థాయిలో ఇంధన ధరలు పెరగడంతో పరిశ్రమ ఖర్చు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ముఖ్యంగా రవాణా, విద్యుదుత్పత్తి, సరఫరా వ్యవస్థలు, మొత్తం సేవల నిర్వహణ వ్యయాలు పెరిగాయని, దీనివల్ల స్టార్ హోటళ్లలో ఆపరేటింగ్ ఖర్చులు గణనీయంగా పెరిగాయని తెలిపారు. ప్రధానంగా ఎల్‌పిజి సరఫరా అస్థిరత, ధరల పెరుగుదల తీవ్రమైన సమస్యగా మారిందని పేర్కొన్నారు. పలు హోటళ్లు సిలిండర్ రీఫిల్ ఆలస్యం, సరఫరా లోపాలను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో హోటళ్లు ప్రత్యామ్నాయ ఇంధన మార్గాలను అన్వేషించాల్సి వస్తోందని పేర్కొన్నారు. అవి ఎక్కువ ఖర్చుతో కూడుకున్నవని, నిర్వహణ పరంగా సవాళ్లను కలిగిస్తున్నాయని తెలిపారు. కుకింగ్

మిగతా 2వ పేజీలో..

## హార్ముజ్ జలసంధిని వెంటనే తెరవండి

- ఇరాన్‌పై తీవ్రపదజాలంతో విమర్శలు
- లేదంటే సర్వనాశనం చేస్తానని ట్రంప్ వార్నింగ్
- లెక్క చేయకుండా ప్రతిదాడులకు దిగుతోన్న ఇరాన్

**వాషింగ్టన్,ఏప్రిల్6 ( చట్టం న్యూస్ ):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై బూతులతో రెచ్చిపోయారు. తాను ఎంతగా హెచ్చరించినా హార్ముజ్ జలసంధిని ఇరాన్ తెరవకపోవడంతో ట్రంప్ తీవ్ర ఆవేశానికి లోనయ్యారు. ఈ సందర్భంగా తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ వేదికగా ఇరాన్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు. హార్ముజ్ జలసంధిని తెరవకుంటే ఇరాన్‌పై భీకర దాడులు తప్పవని హెచ్చరించారు. మంగళవారం పవర్ ప్లాంట్ డే. బ్రిడ్జి డే. అన్నీ కలిపి ఇరాన్‌లోనే జరుగుతాయి. దీనికేదీ సాటిరాదు. హార్ముజ్ జలసంధిని తెరవండి. లేకుంటే ఇరాన్‌లో కాదు. నరకంలో ఉన్నట్లే. చూస్తూ ఉండండి. అల్లాను ప్రార్థించండి అంటూ ట్రంప్ పేర్కొన్నాడు. అంతేకాదు.. ఇందుకోసం రాయలేని రీతిలో బూతు పదాల్ని వాడాడు. హార్ముజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందే అని ఇరాన్‌కు ఇప్పటికే ట్రంప్ హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే. తాను చెప్పినట్లు చేయకపోతే ఇరాన్‌లోని బ్రిడ్జిలు, పవర్ ప్లాంట్లపై దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. తీవ్రంగా గాయపడిన తమ ఎఫ్–15 యుద్ధ విమాన సిబ్బందిని




ఇరాన్‌లోని పర్వత ప్రాంతాల నుంచి రక్షించామని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. పగటిపూటే.. దాదాపు ఏడు గంటలపాటు శ్రమించి ఈ రెస్క్యూ ఆపరేషన్ చేశామన్నారు. పౌరులకు,

మిగతా 2వ పేజీలో..

## ఒంటిమిట్టలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

### వైభవంగా పుష్పయాగం నిర్వహణ



**ఒంటిమిట్ట,ఏప్రిల్6 (చట్టం న్యూస్):** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ముంగింపుదశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా నిర్వహించిన పుష్పయాగం అత్యంత వైభవంగా సాగింది. ఆదివారం సాయంత్రం పుష్పయాగ మహోత్సవం భక్తి భరితంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, ఆలయ శుద్ధి, నిత్యారాధనలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం వైభవంగా ప్రారంభమైంది. తులసీదళాలు, మల్లెలు, రోజాలు, చామంతులు, గన్నేరు, సంపంగి, మొగలి దళం వంటి పుష్పాలు, పత్రాలతో స్వామి, అమ్మవారికి పుష్పనీరాజనం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి సుమారు 3 టన్నుల పుష్పాలు విరాళంగా

మిగతా 2వ పేజీలో..

## ఇజ్రాయెల్‌కు విమాన సర్వీసులు నిలిపివేత

### ఎయిర్ ఇండియా వెల్లడి



**న్యూఢిల్లీ,ఏప్రిల్6 ( చట్టం న్యూస్ ):** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. మే 31 వరకు ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌కు వెళ్లే సర్వీసులను, అక్కడి నుండి వచ్చే అన్ని విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రయాణికులు, విమాన సిబ్బంది భద్రతను దష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్ ఇండియా వెల్లడించింది. ఈ కాలంలో ప్రయాణానికి ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న వారికి పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని, లేదా ఒకసారి ఉచితంగా ప్రయాణ తేదీని మార్చుకునే వెసులుబాటు కల్పిస్తామని ప్రకటిచింది. మే 31 తర్వాత అప్పటి పరిస్థితులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

## నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

- రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టాం
- గత ప్రభుత్వంలో 20శాతం పనులు మాత్రమే చేశారు
- ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయ్యాయి
- పోర్టు పనులను పరిశీలించిన మంత్రులు జనార్థన్, అచ్చన్న

**శ్రీకాకుళం,ఏప్రిల్ 6 ( చట్టం న్యూస్ ):** శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల ఆకాంక్ష మూలపేట పోర్టు అని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు అన్నారు. రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టామని.. 1,524 ఎకరాల్లో 4 బెర్త్‌ల నిర్మాణం

మిగతా 2వ పేజీలో..



## ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి

- ఆనాటి నేతలు... నేటి మోడీతో మరింత బలోపేతం
- 47వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్



**అమరావతి,ఏప్రిల్ 6 ( చట్టం న్యూస్ ):** బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ 47వ వసంతంలో అడుగిడుతున్న శుభ తరుణాన ఆ పార్టీ పార్లమెంటరీ పక్ష నేత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్,

మిగతా 2వ పేజీలో..

## ఆదిలాబాద్‌కు గోదావరి నీరు పారిస్తా

- తుమ్మడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన
- త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు
- పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి
- జిల్లా అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు
- పిప్రిలో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



**ఆదిలాబాద్,ఏప్రిల్6 ( చట్టం న్యూస్ ):** గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి

మిగతా 2వ పేజీలో..

# హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరవండి

**మొదటి పేజీ తరువాయి..**

విమానాలకు ఎక్కువ ప్రమాదం ఉండే ఇలాంటి ఆపరేషన్ చాలా అరుదని చెప్పారు. అయితే, ట్రంప్ హెచ్చరికను ఇరాన్ తేలికగా తీసుకుంది. మరోవైపు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు దాడులు కొనసాగిస్తున్నాయి. ఇరాన్ కూడా కువైట్, బహ్రెయిన్‌లోని చమురు కేంద్రాలపై దాడులు చేస్తోంది. అలాగే, తమ దేశంలోని పౌర కేంద్రాలపై దాడులు చేస్తే తాము కూడా మరింత బలంగా దాడి చేస్తామని ఇరాన్న ఇప్పటికే హెచ్చరించింది. ఇంకోవైపు ఇజ్రాయెల్ దళాలు లెబనాన్ రాజధాని అయిన బీరుట్‌పై దాడులు చేస్తున్నాయి. అలాగే, ఆదివారం అమెరికాకు చెందిన యుద్ధ విమానాల్ని కూల్చివేశామని ఇరాన్ తెలిపింది. సీ-130 అనే రెండు రవాణా విమానాల్ని, రెండు బ్లాక్ హాక్ అనే హెలికాప్టర్లను కూల్చినట్లు తెలిపింది. మరోవైపు అణు ఆధారిత విద్యుత్ క్షేత్రాలపై దాడుల వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సివస్తుందని ఇరాన్ ఆందోళన వ్యక్తం చేసింది. రేడియో ధార్మిక పదార్థాలు భూ, జలాలు, వాతావరణంలోకి విడుదలయితే ఇరాన్‌తో పాటు ఇరాన్ ఆవల కూడా మానవ, పర్యావరణ విపత్తులకు దారితీయవచ్చునని పేర్కొంది. అందువల్ల అమెరికా, ఇజ్రాయిల్ తమ దేశంలోని అణు విద్యుత్ స్థావరాలను లక్ష్యం చేసుకొని చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించాల్సిందిగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్‌కు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఒక లేఖ రాశారు. ఈ లేఖను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇరాన్‌లో పనిచేస్తున్న ఏకైక అణు విద్యుత్ ప్లాంటుపై పదే పదే జరుగుతున్న దాడులు పశ్చిమాసియాలో మానవ, పర్యావరణ ప్రమాదాలకు దారితీస్తాయని అరాగ్చీ హెచ్చరించారు. బుషెహర్ స్థావరంపై జరుగుతున్న దాడులను సహించలేని పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. రేడియో ధార్మిక పదార్థాలు కలుషితమైతే ఇరాన్ సరిహద్దులకు ఆవల కూడా తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. బుషెహర్ ఎ÷-లాంటుపై నాలుగుసార్లు దాడి జరిగిందని సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ ద్వారా ఆయన తెలియజేశారు. రేడియో ధార్మిక పదార్థాలు విడుదలైన పక్షంలో టెహ్రాన్ కంటే గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాలకే ముప్పు ఎక్కువ అని చెప్పారు. ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరలతో లాభాలు దండుకుంటున్న ఇంధన కంపెనీలపై పన్నులు విధించాలని ఐదు యూరోపియన్ దేశాల ఆర్థిక మంత్రులు సూచించారు. ఈ మేరకు జర్మనీ, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, ఆస్ట్రియా దేశాల ఆర్థిక మంత్రులు ఈయూ కమిషన్‌కు ఓ లేఖ రాశారు. 'మనమంతా సంఘటితంగానే ఉన్నామని, చర్య తీసుకునేందుకు సిద్ధమేనని సంకేతం పంపడానికి ఇలాంటివి అవసరం' అని వారు అభిప్రాయపడ్డారు. చమురు కంపెనీలపై భారీగా పన్నులు విధించడం ద్వారా సామాన్య ప్రజలపై భారం తగ్గుతుందని వారు తెలిపారు. దక్షిణ లెబనాన్‌లో ఐరాస శాంతి పరిరక్షక కేంద్ర కార్యాలయానికి చెందిన 17 నిఘా కెమేరాలను ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. కోస్తా ప్రాంతంలోని నఖురా పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ కెమేరాలను ఇజ్రాయిల్ దళాలు ధ్వంసం చేశాయని లెబనాన్‌లో ఐరాస తాత్కాలిక దళాల (యునిఫిల్) ప్రతినిధి కండిస్ అర్డియల్ తెలిపారు. పట్టణంలో తిష్ట వేసిన ఇజ్రాయిల్ సేనలు అక్కడి భవనాలను పెద్ద సంఖ్యలో నేలమట్టం చేశారని ఆమె అన్నారు.

## గ్యాస్ కొరతతో హోటల్ పరిశ్రమ కుదేలు

**మొదటి పేజీ తరువాయి..**

ఆయిల్, రవాణా ఖర్చులు, ఇతర అవసరమైన సరుకుల ధరలు పెరగడం వల్ల మెనూ ధరలను 20 నుంచి 30 శాతం వరకు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అయినప్పటికీ, వినియోగదారుల సంతృప్తి, సేవా ప్రమాణాలను నిలబెట్టడానికి
హోటళ్లు కొంతభాగాన్ని స్వయంగా భరించే ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. నిరంతర ఖర్చు పెరుగుదల లాభాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు హోటళ్లు పలు ఆపరేషనల్ చర్యలను చేపట్టాయని, వాటిలో వంట గది పక్రియలను మెరుగుపరచడం, మెనూలను సరళీకరించడం, శక్తి వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితి పర్యాటక రంగంపై కూడా పరోక్ష ప్రభావాన్ని చూపుతోందని పేర్కొన్నారు. విమాన ఇంధన ధరలు పెరగడం వల్ల ఎయిర్ ఫేర్‌లు అధికమయ్యాయని, దీనివల్ల కార్పొరేట్, లీజర్ ట్రావెల్‌లో కొంత జాగ్రత్త దృక్పథం కనిపిస్తోందని తెలిపారు. ప్రస్తుతం ఆక్యుపెన్సీ స్థాయిలు స్థిరంగా ఉన్నప్పటికీ, పరిస్థితి ఇలాగే కొనసాగితే డిమాండ్ తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. స్టార్ హోటల్ రంగం ప్రస్తుతం ఉద్యోగులను కొనసాగిస్తోందని, దీర్ఘకాలికంగా ఈ పరిస్థితి కొనసాగితే ఉద్యోగ స్థిరత్వంపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ఎల్‌పిజి, ధరల సమస్య ప్రస్తుతం హాస్పిటాలిటీ రంగాన్నీ ప్రభావితం చేస్తోన్న పేర్కొన్నారు. హోటల్ పరిశ్రమకు ఎల్‌పిజి సరఫరా నిరంతరంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఈ క్లిష్ట సమయంలో ఇన్‌పుట్ ఖర్చులను నియంత్రించేందుకు తగిన సహాయ చర్యలను చేపట్టాలని ఆషా విజ్ఞప్తి చేసింది. తక్షణ చర్యలు తీసుకుని పరిశ్రమ కాపాడాలని కోరారు.

## ఒంటిమిట్టలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



**మొదటి పేజీ తరువాయి..**

అందాయి. ప్రకృతి వైపరీత్యాలు తొలగి భక్తులు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థిస్తూ, భూమాతను ప్రసన్నం చేసుకునేందుకు పుష్పయాగం నిర్వహిస్తారు. అలాగే నిత్యకైంకర్యాలలో తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఈ యాగాన్ని చేస్తారని అర్చకులు తెలిపారు. ఈ యాగం ద్వారా దోషాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు సదాశివ రావు, డిప్యూటీ ఈవో ప్రశాంతి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

**మొదటి పేజీ తరువాయి..**

సోమవారం రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. లోక్ సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. పరిశీలన, న్యాయ నిపుణులతో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఆమోదం తెలపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టరూపం దాల్చనుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ 2026 బిల్లుకు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. సుమారు ఐదు గంటల పాటు లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లుపై చర్చలు జరిగాయి. ఎలాంటి సవరణలు లేకుండానే బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఉభయ సభల ఆమోదం తర్వాత లోక్‌సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపింది. ఇవాళ రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం రాష్ట్రపతి సంతకం చేయనున్నారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత హిందీ, ఆంగ్ల భాషల్లో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది.

# ఆదిలాబాద్‌కు గోదావరి నీరు పారిస్తా

**మొదటి పేజీ తరువాయి..**

నీళ్లు పారిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఈ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పిప్రి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ఆయన చెప్పారు. ఆదిలాబాద్ ప్రజలు అమాయకులే కాదు.. నిరంకుశత్వంపై పోరాడిన వీరులంటూ జిల్లా వాసులపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రగతి పాలన బహిరంగ సభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పింది. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే హద్దులు మారుస్తాం. కాళేశర్వం కూలేశ్వరం అయ్యింది. గత పాలకులు తుమ్మిడిహట్టిని పక్కనపెట్టి ఆదిలాబాద్‌కు అన్యాయం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్ట్‌ను నిర్మించి ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం' అని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆదిలాబాద్ దూరంగా ఉంది. కేసులు, అక్రమ నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడి అధికారంలోకి వచ్చాం. విపక్ష ఎమ్మెల్యేలను శత్రువులు గా కాంగ్రెస్ ప్రభుత్వం చూడదు. బీజేపీ, బీఆర్‌ఎస్ మాకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే.. శత్రువులు కాదు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచాం. గతంలో ముఖ్యమంత్రి వస్తుంటే విపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్బంధాలు చేసేవారు. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినా నిధులు ఇస్తున్నాం. మేం పార్టీలు చూడకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చూడటం లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదు. కానీ మేం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అమాయకులే కాదు. నిరంకుశత్వం మీద పోరాడిన వీరులు. కుమురంభీం వంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై
పోరాడారు. ఆదిలాబాద్ జిల్లాకు ఆధునిక విద్య, వైద్యం వంటి సదుపాయాలు ఇంకా దక్కలేదు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం కాదు ఇది. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం.. దేశంలో మరొకటి లేదు. యువత మత్తుబాట వదిలి.. మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నాం. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే ఆశయంతో ఈ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటిని దాచుకోవడం నేర్చుకోవాలి

**మొదటి పేజీ తరువాయి..**






ఒక్క ఖరీఫ్‌కు 547 టీఎంసీలు, రబీకి 343 టీఎంసీలు నీరు అవసరమవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. పరిశ్రమలకు 28, తాగు నీటికి 158 టీఎంసీల చొప్పున మొత్తంగా 1,300 టీఎంసీల వరకూ మనకు అవసరం అవుతాయని వివరించారు. ఈ ఏడాదిలో 74 టీఎంసీల నీరు అనంతపురం వరకూ తీసుకు వచ్చామని ఆయన గుర్తు చేశారు. గత పాలకులు మనకు అడ్రస్ లేకుండా చేశారంటూ వైసీపీపై సీఎం చంద్రబాబు నిప్పులు చెరిగారు. ఇప్పుడు మా రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారని.. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం అని పేర్కొన్నారు.మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వైకాపాపై సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. వారికి మావిగన్ పిచ్చి ముదిరిందని మండిపడ్డారు. రాష్ట్రంపై పగబట్టారు.. ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని.. పేరు పలికితే పుణ్యం వస్తుంది. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండండి. రాష్ట్రానికి ఒకే రాజధాని.. అది అమరావతి అని సీఎం స్పష్టం చేశారు. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు రాజధాని అమరావతికి మద్దతు పలికాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఒక్క దిక్కు మాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిచ్చి ముదిరి మావిగన్ అనే పేరు తెరపైకి తెచ్చారని వైసీపీ అధినేతపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. రాజధాని అమరావతి అని పలకడానికి కూడా ఇష్టం లేని వ్యక్తులు మావిగన్ అంటున్నారని సీఎం చంద్రబాబు వ్యంగ్యంగా అన్నారు. బాబాయిని చంపి తన చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారంటూ వైసీపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎండగట్టారు. రాజధాని అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే.. అవి చూసి సహించలేకే ఈ విమర్శలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని వైసీపీ నేతల తీరుపై ఏపీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. దేవాలయాలపై దాడులు చేసి తిరిగి ప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తున్నారంటూ వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. తిరుమలలో శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జలధారతో ప్రతి ఎకరానికీ జలహారతి ఇచ్చేలా కార్యాచరణ చేపడదామని ప్రజలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

**మొదటి పేజీ తరువాయి..**





చేపడుతున్నట్లు చెప్పారు. మూలపేట పోర్టును ఈ నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మూలపేట పోర్టును మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ మాట్లాడుతూ.. మూలపేట పోర్టును పరిశీలించామని.. ప్రాజెక్ట్ నిర్మాణంపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. గత ప్రభుత్వంలో 20 శాతం పనులు మాత్రమే చేశారని.. ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. 20 నెలల్లోనే 49.63 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తి అయినట్లు వెల్లడించారు. కరపత్రిక అడ్డం పెట్టుకుని విష ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీపై విరుచుకుపడ్డారు. పోర్టు కోసం కావల్సిన ఉప్పు భూముల విషయంలో వైసీపీ చిత్తశుద్ధితో పని చేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఉప్పు భూముల కోసం కేంద్రంతో సంప్రదింపులు చేశామని.. 385 ఎకరాల ఉప్పు భూములను లీజ్‌పై కేంద్ర కేటాయించిందని వివరించారు. వైసీపీ నేతలు 20 నెలల తరువాత రాజకీయం చేస్తున్నారని.. ఈ 20 నెలలు నిద్ర పోయారా అంటూ మంత్రి ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసమే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ప్రజలు అందుకే బుద్ధి చెప్పారన్నారు. రాజధాని అని చెప్పినా ఉత్తరాంధ్ర ప్రజలు నమ్మలేదని తెలిపారు. ప్రజా సమస్యలపై మాట్లాడుదాం రండి అంటూ జగన్, వైసీపీ నేతలకు మంత్రి ఛాలెంజ్ విసిరారు. గతంలో అమరావతికి ఓకే అన్న జగన్.. మోసం చేసి తరువాత మూడు ముక్కలు ఆట ఆడారని మండిపడ్డారు. జగన్ అభివృద్ధి చేసే నాయకుడు కాదని.. విధ్వంసం సృష్టించే నాయకుడంటూ వ్యాఖ్యలు చేశారు. అందుకే 11సీట్లకి పరిమిత మయ్యారన్నారు. దేశంలో ప్రైవేట్ ఎయిర్‌పోర్ట్‌లలో బోగాపురం నంబర్ 2గా నిలవనుందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. మూలపేట పోర్టు పనులు 20 శాతం నుంచి 76 శాతం పూర్తి చేశామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పోర్టులో షిప్ వచ్చి ల్యాండ్ అయ్యిందని.. బెర్త్‌లు లేకుండా షిప్ రాదు కదా అని అన్నారు. పోర్టు కట్టిన తరువాత రోడ్డు, రైల్ రవాణా అవసరం ఉంటుందన్నారు. పోర్టు కోసం సాల్ట్ ల్యాండ్‌లు అవసరమని చెప్పుకొచ్చారు. 385 ఎకరాల సాల్ట్ భూములను కేంద్రం లీజ్‌కు ఇచ్చిందని.. దానిపై కూడా ఒకరు కోర్టుకు వెళ్లారన్నారు. పోర్టును నవంబర్ నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫారెస్ట్ ల్యాండ్, జెన్ కో పవర్ సమస్యలను వీలైనంత త్వరగా అధిగమిస్తామని చెప్పారు. అడ్డగోలుగా పూర్తి చేసినట్లు వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూలపేట వాసులు త్యాగధనులని కొనియాడారు. పోర్టు వల్ల ఎంఎ÷-లాయిమెంట్ రాదని.. పోర్టు పరిసరాల్లో పరిశ్రమలు రావాల్సి ఉందని చెప్పారు. 17 కంపెనీలు ల్యాండ్ కోసం దరఖాస్తు చేశాయని తెలిపారు. మూలపేట పోర్టును సందర్శించడానికి వైసీపీని ఆహ్వానిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

## ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి

**మొదటి పేజీ తరువాయి..**

పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం పట్ల ప్రేమ, దేశ ప్రజల పట్ల అంకితభావం అనే సిద్ధాంతాలే ఆలంబనగా బీజేపీ ముందుకు వెళ్తోందన్నారు. మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ లాంటి మహనీయుల సంకల్పం.. ప్రధాని మోదీ అచంచల విశ్వాసంతో కూడిన పోరాటంతో నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ కీర్తిని ఆర్జించిందని వెల్లడించారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం క్లిష్ట పరిస్థితుల్లో కూడా సమర్థవంతమైన విధానాలు అమలు చేస్తూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిందన్నారు. భారతీయ జనతా పార్టీ వికసిత్ సంకల్పం దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

## ఉచిత గాలికుంటూ వ్యాధి నిరోధక టీకాల శిబిరం



**పెగడపల్లి, ఏప్రిల్ 06 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని ఐతిపల్లి గ్రామంలో ఆవులకు గేదెలకు దూడలకు ఉచిత గాలి కుంటూ వ్యాధి నివారణ టీకాలు ప్రారంభించిన గ్రామ సర్పంచి మేకల అంజమ్మ మల్లయ్య, డాక్టర్ హేమలత, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మతిన్, వినీత్, జానీ పాషా,వంశీ, రైతులు జిట్టవేణి మల్లేశం,తాటికంటి రాజయ్య,జిట్టవేణి మల్లయ్య,అడాల లక్ష్మారెడ్డి, నల్లల బుచ్చయ్య,రాగి అంజయ్య,, తదితరులు రైతులు పాల్గొన్నారు.

# చుక్క చుక్క నువ్వు ఒడిసి పడదాం

- రాష్ట్రమంతా వర్షపు నీటి సంరక్షణకు 100 రోజులు కార్యాచరణ ప్రణాళికలు అమలకు శ్రీకారం.
- ప్రతి నీటి చుక్కను సంరక్షించడం, భూగర్భ జలాలు స్థాయిని పెంచే బాధ్యత మనందరిపై ఉంది.
- "నీటి భద్రత -- సాగునీటి సంఘాలు బాధ్యత" కార్యక్రమానికి శ్రీకారం.
- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...



**ఏలూరు/నూజివీడు, ఏప్రియల్ 06:** నూజివీడు పట్టణంలోని పెద్ద చెరువు వద్ద సోమవారం "నీటి భద్రత -- సాగునీటి సంఘాలు బాధ్యత" కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు రాష్ట్రంలో భూగర్భ జలాలు మట్టాన్ని పెంపొందించడం, నీటి వనరులు సంరక్షణ, సాగునీటి వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా "నీటి భద్రత -- సాగునీటి సంఘాల బాధ్యత" పేరుతో వంద రోజుల ప్రత్యేక కార్యక్రమం దృష్ట్యా ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.అధికారులకు, సాగునీటి సంఘాలు అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతులు సంఘ నాయకులు, రైతులతో సుదీర్ఘంగా సమీక్షించి మంత్రి కొలుసు పార్థసారథి పలుసూచనలు జారీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ప్రతి నీటి చుక్కను సంరక్షించడం భూగర్భ జలాలు స్థాయిని పెంచడం మనందరి బాధ్యత అన్నారు.నీటి వృథాను నివారించడం సమర్థ వంతమైన వినియోగాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.నూజివీడు నియోజకవర్గం 4 మండలాలో యంఐ ట్యాంకులు 68, పంచాయతీరాజ్ ట్యాంకులు 300 ఉన్నాయని తెలిపారు. కెపాసిటీ ఇన్ యంసియఫ్టి 4,117.852 , రిజిస్ట్రేషన్ ఆయకట్టు 25,947.09 ఎకరాలు ఉందని తెలిపారు.ఈ క్రమంలో ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు 100 రోజులు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సాగునీటి కాలువలు, చెరువులు, జలాశయాలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సాగునీటి కాలువలు, చెరువులు గట్లను బలోపేతం చేయడం, కాలువల పూడికతీత, లాక్స్ మరమ్మతులు వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనుల్లో ప్రజలు భాగస్వామ్యం ఉంటేనే పనులు వేగవంతంగా, నాణ్యతగా జరుగుతాయని అన్నారు. జలవనరులు శాఖ, అటవీ శాఖ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు, డ్వామా తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం అమలు చేయబడుతుందని తెలిపారు. కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 6--15 పనులు గుర్తింపు, కాలువల శుభ్రపరచడం, పూడికతీత పనులు జరుగుతాయని అన్నారు. ఏప్రిల్ 16--20 పరిపాలనా అనుమతులు, ఏప్రిల్ 21--జూలై 9 పనుల అమలు జూలై 10--14 తుది నివేదిక సమర్పణ ఉంటుందన్నారు. ప్రజలు భాగస్వామ్యంతో నాణ్యమైన పనులు చేపట్టి, సాగునీరు శివారు భూములు వరకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాలువలు, బోదుల ఆక్రమణలను తొలగించే దిశగా కృషి చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు మేరకు పనులను సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, వివిధ శాఖలు అధికారులు, నీటి సంఘాలు అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నగునూరు గ్రామంలో ఘనంగా బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- భారతదేశ సంక్షేమమే బీజేపీ పార్టీ లక్ష్యం ;
- మాడిశెట్టి సంతోష్ కుమార్
- కరీంనగర్ రూరల్ బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు ;

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 6,( చట్టం బ్యూరో ) :** నగునూర్ గ్రామంలో శక్తి కేంద్ర ఇన్చార్జి ఆవుల సునీల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చే బిజెపి మండల అధ్యక్షులు మాడిశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ దేశం తర్వాత పార్టీ తర్వాత నేను అనే భావనతో భారతీయ జనతా పార్టీ పనిచేస్తున్నది అందులో భాగంగానే దీన్ దయాల్ ఉపాధ్యాయ గారు ఇచ్చిన సిద్ధాంతం ప్రకారం దేశంలోనే ప్రజలకు అడ్డడుగు వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అంటూ అంత్యోదయ ధ్వారా చిట్ట చివరి వరకు సంక్షేమ ఫలాలు కల్పించాలని ఉద్దేశంతో భారతీయ జనతా పార్టీ పనిచేస్తున్నది అందులోనే భాగంగా దేశ సంక్షేమము దేశ రక్షణ దేశ సార్వభౌమాధికారం,ఈ దేశ అస్తిత్వానికి భంగం వాటిల్లకుండా రక్షణ కొరకు దేశ ప్రజల అభ్యున్నత కొరకు అభివృద్ధి కొరకు సంక్షేమాన్ని కొరకు దేశంలో పని చేస్తున్నా పార్టీ స్థానికులకు కార్మికులకు వ్యవసాయ రైతన్నలకు వ్యాపారవేత్తలకు వివిధ రంగాల వారికి ఉత్తమమైన జీవితాన్ని కల్పించాలని కలిగిన ఏకైక పార్టీ అదేవిధంగా వారసత్వము లేకుండా పనిచేస్తున్న పార్టీ బిజెపి ఈనాడు ప్రపంచంలోనే మూడవ ఆర్థిక వ్యవస్థగా కలిగిన దేశంగా ప్రపంచంలోనే ఉన్నత ప్రమాణాలు కల్పిస్తున్న పార్టీగా అవినీతి లేని సమాజం ప్రభుత్వము అధికారం కుటుంబం ఇలా ఎన్నో రకాలుగా ప్రపంచంలోనే ఒక అభివృద్ధి చెందిన దేశంగా ఉద్భవించాలని ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ప్రపంచానికి ఒక గురువు దేశంగా ఆవిర్భవించబోతుంది. కావున ఈ పార్టీకి



దేశము ఎంతో ముఖ్యమో ఈ దేశానికి కూడా ఈ పార్టీ అంతే ముఖ్యము బిజెపి పార్టీ నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో చేస్తున్న పనికి వచ్చి మేచ్చి అండదండలు అందిస్తున్న ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ ఇలాగే ప్రజలందరికీ అభిమానాలను అందించాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొత్తకొండ దీపక్, బూత్ అధ్యక్షులు రాజు, శేఖర్, అజయ్, సంతోష్, వినయ్, బిజెపి నాయకులు సాయికిరణ్, మోహన్ రెడ్డి, కోట మల్లయ్య, హరికృష్ణ, గణేష్ రెడ్డి, శ్రీనివాస్ అప్రోచ్, మహేష్, సంజయ్, మారుతీ, విక్రమ్, సాగర్, కిరణ్, హరీష్,విక్రమ్,అరవింద్ అక్షయ్,చిక్కు, విజయ్, తదితరులు బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మల్టీడిసిప్లినరీ జ్ఞానం -- భవిష్యత్తు నిర్మాణానికి దారి





**జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్ సర్టిఫికేట్ అందుకున్న వృక్ష శాస్త్ర అధ్యాపకులు**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 6,( చట్టం బ్యూరో ) :** కరీంనగర్‌లోని ఎస్. ఆర్. ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ (అటానమస్) కరీంనగర్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిజం మరియు మాస్ కమ్యూనికేషన్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికేట్‌లను ఘనంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి తెలుగు విభాగాధిపతి బూర్ల చంద్రశేఖర్ అధ్యక్షత వహించి, అధ్యాపకులకు స్వయంగా సర్టిఫికేట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిజం సమాజానికి అద్దం వంటిదని, సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిజాయితీగా ప్రజలకు తెలియజేయడం జర్నలిస్టుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో కోర్సు పూర్తి చేసుకున్న డాక్టర్ పడాల తిరుపతి మరియు డాక్టర్ బుంగా తిరుపతి అధ్యాపకులను అభినందిస్తూ, మాస్ కమ్యూనికేషన్ రంగం ప్రస్తుత కాలంలో విస్తృత అవకాశాలను అందిస్తున్నదని తెలిపారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులు రచనా నైపుణ్యాలు, వాక్చాతుర్యం, సమాచార ప్రసార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటారని పేర్కొన్నారు. అలాగే వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ, బోటనీ విభాగానికి చెందిన డాక్టర్ పడాల తిరుపతి మరియు డాక్టర్ బుంగా తిరుపతి వంటి అధ్యాపకులు జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్ వంటి విభిన్న రంగాల్లో కూడా శిక్షణ పొందడం ఎంతో ప్రశంసనీయమని అన్నారు. ప్రస్తుత కాలంలో బహుళశాఖల జ్ఞానం ఎంతో అవసరమని, ఈ విధమైన జ్ఞానం విద్యార్థులకు అన్ని కోణాల్లో భవిష్యత్తును రూపుదిద్దు కోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అన్ని విషయాల్లో అవగాహన పెంపొందించు కుంటూ ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ రౌతు రాధాకృష్ణ, డాక్టర్ మహమ్మద్ తాహిర్ హుస్సేన్, డా. కందుకూరి కళాజ్యోతి, డాక్టర్ ఆసంపల్లి స్వరూప రాణి, డాక్టర్ మహమ్మద్ తాజుద్దీన్ పాల్గొన్నారు.విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్టిఫికేట్‌లు అందుకున్న అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# ప్రజా ఉద్యమ నేత కట్టెభోయిన వెంకటేశ్వర్లు

- మహనీయునికి విప్లవ జోహార్లు
- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెభోయిన శ్రీనివాస్

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఎప్రిల్ 06,(చట్టం న్యూస్) :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కట్టెబోయిన వెంకటేశ్వర్లు. మద్దివంచ గ్రామంలో వెంకటేశ్వర్లు 21వర్ధంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జెండాను సిపిఐ శాఖ కార్యదర్శి దూపాటి జనార్దన్ జెండా ఆవిష్కరించారు.అనంతరం వెంకటేశ్వర్లు స్తూపం చిత్ర పటానికి రాగం రమేష్,గుగులోత్ భీమ్ల పూలమాల వేశి నివాళులు అర్పించారు.అనంతరం వర్ధంతి సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టే బోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ కట్టెభోయిన వెంకటేశ్వర్లు బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం తపించారు ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారు ఈ ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు చనిపోయిన 20 సంవత్సరాలు అవుతున్న ప్రజల హృదయాల్లో




శిరస్థాయిగా నిలిచిపోయారు ఈ ప్రాంత అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసే దాంట్లో ముందు భాగాన ఉన్నారు ఆయన చూపిన మార్గంలో ఈనాటి పార్టీ శ్రేణులు అందరూ పనిచేయాలని కమ్యూనిస్టు పార్టీ బలోపేతం చేసినప్పుడే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళి అన్నారు.వెంకటేశ్వర్లు అడుగుజాడలో మనమందరం పనిచేయాలని అన్నారు.నిరంతరం ప్రజల మద్యే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కరిస్తు ప్రజల మద్యే ఉండేవారని అన్నారు.అమర జీవి సిపిఐ సీనియర్ నాయకులు కట్టెభోయిన వెంకటేశ్వర్లు గారి 21వర్ధంతి సందర్భంగా మద్దివంచ గ్రామంలో వారి స్మారక స్థూపం వద్ద పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న,సీనియర్ నాయకులు కట్టెభోయిన భిక్షమయ్య,రాగం సత్యనారాయణ, ఇల్లుటూరి వెంకన్న,దారావత్ వీరన్న,రాగం బాబు, రాగం రాము,గుగులోత సక్కృ, పున్నం వెంకన్న,చౌకాల బిక్షం, కట్టెభోయిన పిచ్చయ్య,బండి ఉప్పయ్య,సర్వర్ మీయా, తోకల పుల్లయ్య,ప్రవీణ్,రాగం పుల్లయ్య, రవిశెంకర్,శ్రీను, మంగ్యా తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించిన బిజెపి నాయకులు.



**పెగడపల్లి, ఏప్రిల్ 06( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఎస్ ఐ ఆర్ కన్వీనర్ గంగుల కొమురెల్లి,మండల ప్రధాన కార్యదర్శి తోడేటి గట్టయ్య , బూత్ అధ్యక్షులు పోతుగంటి రాజేశం, శక్తి కేంద్ర ఇంచార్జ్ కన్నం పవన్ కళ్యాణ్ , బిజెపి సీనియర్ నాయకులు మిట్టపల్లి మనోజ్, సీనియర్ నాయకులు నెల్లి చందు తదితర నాయకులు పాల్గొనడం.

## వెంగళాయిపేట గ్రామ అంగన్వాడీ కేంద్రం రెండు లో పౌష్టిక ఆహార పదార్థాలు పంపిణీ.



**పెగడపల్లి, ఏప్రిల్ 06 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని వెంగాళాయిపేట గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో రెండులో పిల్లలకు పౌష్టికాహార దృష్ట కోడిగుడ్లు, బాలమృతము పంపిణీ చేయడం జరిగింది. సర్పంచ్ మోకెనపెల్లి గోపాల్, మాట్లాడుతూ గ్రామ సమాజం ఆరోగ్యం పై ఉన్న చైతన్యం స్పష్టమవుతున్నది పిల్లలు శారీరక మానసిక అభివృద్ధికి ఎంతో ఉపయోగకరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వసంత,వార్డు సభ్యులు శ్రీరాం,నర్సయ్య,ఐతరవేని గంగాధర్, పిల్లలు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చిన్నారులకు అంగన్వాడి కేంద్రం మూడులో పౌష్టికాహార పదార్థాల పంపిణీ



**పెగడపల్లి ఏప్రిల్ 06( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని ఐతిపల్లి గ్రామంలో చిన్నారులకు అంగన్వాడి కేంద్రం మూడులో పౌష్టిక ఆహార పదార్థాలను సర్పంచ్ మేకల అంజమ్మ- మల్లయ్య, వార్డ్ నెంబర్లు ఎండి హసీనా -రజాక్, పలుమార్ రమ -గంగాధర్, పంచాయతీ సెక్రటరీ మంజుల, టీచర్ మిర్యాని,ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగినది వీరు అందరూ మాట్లాడిన మాట పిల్లలు శారీరక మానసిక అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని అని అన్నారు. ఈ కార్యక్రమానికి చిన్న పిల్లల తల్లిదండ్రులు ఆశా వర్కర్లు, ఆయా తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ కార్యదర్శిగా పూర్ణచంద్రాచార్యులు నియామకం



**కొడిమ్యాల, ఏప్రిల్ 6(చట్టం) :** తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ జాతీయ కార్యదర్శిగా జగిత్యాలకు చెందిన ప్రముఖ వాస్తు జ్యోతిష్య నిపుణులు తుమ్మనపల్లి పూర్ణచంద్రాచార్యులు నియామకం అయ్యారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ బ్రహ్మశ్రీ పోలోజు రాజ్ కుమార్ చార్యులు, జాతీయ అధ్యక్షులు బ్రహ్మశ్రీ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మశ్రీ పొడిచెట్టి విష్ణువర్ధన్ లు సోమవారం ఒక ప్రకటనలో పూర్ణచంద్రాచార్యులును నియమించినట్లు తెలిపారు.

## రెండో విడత వార్డ్ మెంబర్లకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం.



**పెగడపల్లి ఏప్రిల్ 06 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం రెండో విడతలో భాగంగా నామాపూర్, నంచర్ల,నందగిరి, నరసింహుని పేట,రాములపల్లి, రాజారామ్ పల్లి, రాంభద్రుని పల్లి, శాలపల్లి, సుద్దపల్లి,వెంగళాయ పేట్, ఎల్లాపూర్ గ్రామాలకు చెందిన వార్డ్ మెంబర్లు, హాజరయ్యారు. పంచాయతీరాజ్ చట్టం 2018 గురించి, గ్రామసభల నిర్వహణ పలు అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సంబంధించి విశ్లేషించడానికి టి ఓ టి లుగా కడారి ప్రవీణ్ , జి మహేష్, ఎల్ శౌరి,, బి విద్యాసాగర్, వ్యవహరించారు.

# సహజవాయువు కోసం ఉద్యమించాల్సిందే !

పశ్చిమాసియా యుద్ధం వల్ల ఇంధనం, గ్యాస్ సమస్యలు తీవ్రం అవుతున్నాయి. ప్రధానంగా గ్యాస్ సమస్య తీవ్రత పెరుగుతోంది. ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు. ట్రంప్ బెదరింపులు, హుంకరింపులతో సమస్య మరింత జటిలం అవుతోంది. ఇరాన్ కూడా తగ్గేది లేదన్నట్లుగా పోరాడుతోంది. అమెరికా యుద్ధ విమానాలను కూల్చేస్తోంది. 48 గంటల గడువు ముగిసిన వేళ, నియంత ట్రంప్ ఏ దుర్మార్గాలకు ఒడిగడతాడో తెలియడం లేదు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రం తీవ్ర గ్యాస్ కొరతను ఎదుర్కొంటోంది. సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులు హోటల్ నిర్వాహకులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని తినుబండారాల ధరలు పెరుగుతున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచుతుందన్న ప్రచారం కూడా సాగుతోంది. అదే జరిగితే నిత్యావసరాల ధరలు మిన్నంటే ప్రమాదం వుంది. మరోవైపు సహజవాయువు కేటాయింపులు లేక రాష్ట్రంలో గ్యాస్ ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలు మూతబడిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా అధిక రేటుకు డిస్కంలు విద్యుత్ కొనాల్సివస్తోంది. ఈ క్రమంలో దేశీయంగా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికే గ్యాస్ కొరతతో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. హోటల్ పరిశ్రమ కుదేలవుతోంది. కట్టెల పొయ్యి లతో కొన్నిచోట్ల నెట్టుకు వస్తున్నారు. విద్యుత్ స్టవ్‌ల ఉత్పత్తి పెరిగింది. అయితే తగినంత విద్యుత్ సరఫరా కూడా కష్టంగానే ఉంది. ఎండాకాలం కావడంతో అడపాదడపా కరెంట్ కష్టాలు మొదలు అయ్యాయి. ఈ క్రమంలో కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, సహజ వాయువు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక్కడి సహజవాయువును గృహ, హోటల్ అవసరాలకు మళ్లించాలి. అప్పుడు డిమాండ్‌లో కనీసం 50శాతం అయినా అధిగమించగలం. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల హక్కు. ఇక్కడి వనరులు వీరికే దక్కాలి. ఈ సహజవాయువులో కనీసం సగం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలని సిపిఎం అధ్వర్యంలో వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు, సంస్థలకు చెందినవారు డిమాండ్ చేస్తున్నారు. వీరి డిమాండ్ కూడా న్యాయంగా ఉన్నదే. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే డిమాండ్‌తో జనవిజ్ఞాన వేదికవంటి వివిధ సంస్థలు అనేక రూపాల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాయి. అయితే ఆ తరువాత



ఉమ్మడి రాష్ట్ర విభజన కోరుతూ ఆందోళనలు, ఇతరేతర కారణాలతో అది వెనక్కు వెళ్లింది. ఈ గ్యాస్ వల్ల ఎపి ఆర్థిక వ్యస్థ కూడా బలపడుతుంది. ప్రజల సమస్యలు తీరుతాయి. దీనిపై చంద్రబాబు పట్టుబట్టాల్సిన తరుణం ఇది. అయితే కార్పోరేట్ దిగ్గజాల చేతిలో ఉన్న ఈ వ్యవహారం విషయంలో చంద్రబాబు అంత తొందరగా నోరువిప్పుతారని అనుకోరాదు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడ రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి. ఇక్కడ లభించే గ్యాస్ ఇక్కడి ప్రజలకు సరఫరా చేస్తే... రాష్ట్ర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడగలదు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం సమకూరుతుంది. ఈ విషయంలో స్థానిక ప్రజలే ఉద్యమాలు చేపట్టాల్సి ఉంది. బ్లో అవుట్‌లతో బాధలు పడుతున్న ప్రజలు, గ్యాస్ వల్ల లాభాలు కూడా పొందాలి. మన గ్యాస్ మనకే అని ఉద్యమించాలి. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన కృష్ణా-గోదావరి డి6 బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును రోజుకు 21 వేల టన్నులు ఉత్పత్తి అవుతోందని అంచనా. రిలయన్స్ కంపెనీ పైపులైన్లు ద్వారా ఇక్కడ నుండి మహారాష్ట్ర, గుజరాత్‌కు గ్యాస్ సరఫరా చేసుకుని అక్కడ పరిశ్రమలు, ఇతర అవసరాలకు విక్రయించి వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో వంట గ్యాస్ వినియోగం రోజుకు నాలుగు వేల టన్నులు. ఆయిల్ డ్రిల్లింగ్, ఇతర కార్యకలాపాలతో నిత్య కాలుష్యమేగాక బ్లో అవుట్‌లు, ఇతర ప్రమాదాల్లో రాష్ట్రం విలువైన ప్రాణాలను కోల్పోతున్నది. అత్యంత విలువైన సహజ వనరులను రాష్ట్రం కోల్పోతోంది. కనుక నష్టాలు రాష్ట్రానికి, లాభాలు రిలయన్స్‌కు చెందడం సరికాదు. ఇక్కడి సహజవాయువును కనీసం 50శాతం ఇక్కడి ప్రాంత ప్రజలకు కేటాయించిన తరవాతనే మిగతాది తరలించడం న్యాయం. మన తీరంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్ రాష్ట్రానికి కేటాయిస్తే కరెంటు కష్టాలు కూడా తగ్గుతాయి. కాబట్టి రాష్ట్రంలో లభించే ప్రకృతి వనరులను సరిగా వినియోగించు కుంటే ఇలాంటి ఇబ్బందులు రావు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌లో మన వాటా మనకు వస్తే రూ.950 ఉన్న సిలిండర్ ధర రూ.300- 350కు, యూనిట్ కరెంటు రూపాయికి వచ్చే అవకాశం ఏర్పడుతుంది. పిఎన్‌జి ఇంకా తక్కువ ధరకే లభిస్తుంది. చమురు, సహజ వాయువు జాతీయ సంపద కనుక రాష్ట్రానికి ఇవ్వాల్సిన న్యాయమైన వాటా ఇచ్చి మిగిలినది ఇతర రాష్ట్రాలకు తీసుకెళితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. మన సహజ వనరులను రిలయన్స్‌కు అప్పగించి, మనం ఇబ్బంది పడటం అన్యాయం. కెజి బేసిన్‌లో చట్టబద్ధంగా రావాల్సిన చమురు, సహజవాయువు వాటాను పొందేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అవసరమైతే అసెంబ్లీ తీర్మానించాలి. ఈ విషయంలో అఖిలపక్షంలో చర్చించాలి. గతంలోకి వెళితే కృష్ణా-గోదావరి డి6 బేసిన్ ను రిలయన్స్ ఇండిస్ట్రీస్‌కు 20 ఏళ్ల క్రితం అప్పుడున్న ప్రభుత్వాలు చట్టవిరుద్ధం గా కేటాయించాయి. భూగర్భ నిక్షేపాలను కనుగొన్నపుడు లభించే ఉత్పత్తుల్లో ఆయా కంపెనీలు కేంద్ర ప్రభుత్వానికి వాటాగా సరఫరా చేసే చమురు, సహజవాయువులో 50 శాతాన్ని సంబంధిత రాష్ట్రాలకు కేటాయించాలని 12వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఈ విషయాన్ని గురించి పెట్రోలియం మంత్రిత్వ శాఖను నిలదీసింది. కనుక ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో ఉత్పత్తి అవుతున్న కృష్ణా-గోదావరి బేసిన్ సహజ వాయువులో సగం రాష్ట్ర అవసరాలకు కేటాయించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. దీనిని చంద్రబాబు లేవనెత్తడం మంచిది. కేంద్రంలో అధికారం పంచుకుంటున్న చంద్రబాబు ఈ విషయంలో ఇప్పటికైనా డిమాండ్ ముందుకు తీసుకుని రావాలి. రాష్ట్రాలకు రాజ్యాంగ బద్ధంగా ఇవ్వాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం ఎలాగూ ఇవ్వడం లేదు. విభజన సమస్యలు అలాగే ఉన్నాయి. అయితే చంద్రబాబు కోరిన వెంటనే ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. అందువల్ల సహజ వాయువు విషయంలో ఒత్తిడి పెంచితే కేంద్రం దిగిరాక తప్పదు. ప్రజలు కూడా ఆందోళనలకు దిగితే తప్ప రాష్ట్రానికి చురుకు పుట్టదు.


## కెసిఆర్ కార్యాలయంపై దాడి

### గజ్వేల్ బంద్‌తో మూతపడ్డ దుకాణాలు

**గజ్వేల్,ఏప్రిల్6 :** గజ్వేల్‌లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. వ్యాపారులు స్వచ్ఛందంగా షాపులను మూసివేశారు. ఆర్టీసీ బస్సులన్నీ డిపోకే పరిమితమయ్యాయి. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. బంద్ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమని తెలిపారు. ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌కు దాడుల సమాచారం ఉందా? లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు హామీలపై దృష్టి సారించాలని సూచించారు. హామీలను మరిచి ప్రతిపక్షాలపై దాడులు చేయడమేంటని వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా వారి ఆఫీసుల్లో మోదీ ఫొటో పెట్టారా అని నిలదీశారు. బీజేపీ ఎమ్మెల్యేల ఆఫీసుల్లోనూ సీఎం ఫొటో పెట్టిస్తారా అని ప్రశ్నించారు. గజ్వేల్ ఎమ్మెల్యే అధికార కార్యాలయం పై కాంగ్రెస్ శ్రేణుల దాడికి నిరసనగా గజ్వేల్‌లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. బీఆర్ఎస్ శ్రేణుల పిలుపు మేరకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నారు. గజ్వేల్ బంద్‌లో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ముందు బీఆర్ఎస్ శ్రేణులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# చంద్రబాబు చేతిలో ఐదేళ్ల భవిష్యత్

- భద్రాచలం అభివృద్ధికి ఐదేళ్ల ముఖ్యం
- మౌనంగా ఐదు మండలాలను కలుపుకున్న బాబు
- మంత్రి తుమ్మల లేఖతో మరోమారు తెరపైకి సమస్య



**భద్రాచలం,ఏప్రిల్6:** భద్రాచలం అభివృద్ధికి, నీటి మునక గండం నుంచి బయటపడడానికి ఇప్పుడు ఐదూళ్లు అవసరం గతంలో విభజన తరవాత ఏకపక్ష నిర్ణయంతో ఐదు మండలాలను ఎపిలో కలిపారు. భద్రాచలానికి ఆనుకొని ఉన్న 5 గ్రామాలను ఏపీ నుంచి వేరుచేసి తెలంగాణలో కలపాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరుతోంది. గత కొన్నేళ్లుగా ఈ విషయంలో కేంద్రం నాన్చివేత ధోరణి అవలంబిస్తోంది. ఎపి ప్రభుత్వం కూడా అదే వైఖరితో ఉంది. ఐదు మండలాలను కలపడం వల్లనే పోలవరం సాధ్యం అయ్యిందని పదేపదే చెబుతున్న చంద్రబాబు ఈ విషయంలో పట్టువిడుపులు ప్రకటించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధి తనకు ముఖ్యమని ప్రకటించిన చంద్రబాబు ఈ విషయంలో మాత్రం పెదవి విప్పడం లేదు. చంద్రబాబు తలచుకుంటే ఈ సమస్య చిటికెలో పరిష్కారం అవుతుంది. పరిపాలన సౌలభ్యం కోసం ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేసి గిరిజనుల ఇబ్బందులు తొలగించాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో కలిపిన యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలు పరిపాలనపరంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను పదేపదే కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆ ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. తెలంగాణలోని రెండు భాగాల మధ్య ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్నాయి. మిగిలిన సరిహద్దులు గోదావరి నది, రిజర్వు ఫారెస్టు ప్రాంతాలతో చుట్టుముట్టు ఉన్నాయి. దీంతో పరిపాలనపరమైన సమస్యలు ఎదురవు తున్నాయి. ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామ పంచాయతీలకు పోలవరం ముంపు సమస్యతో ఎలాంటి సంబంధం లేదు. కానీ పరిపాలన, జీవనోపాధి, ప్రజాసేవల కోసం ఆ గ్రామాల ప్రజలు భద్రాచలంపైనే పూర్తిగా ఆధారపడి ఉన్నారు. ఏపీలో కొనసాగటం వల్ల గత 12 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామాల్లోని గిరిజనులు తమ ఊళ్లను తెలంగాణలోనే కలపాలని ఎప్పటి నుంచో కోరుతున్నా, కేంద్రం కానీ, ఎపి కానీ పట్టించుకోవడం లేదు. ఇక, ఆ గ్రామాల ప్రజలు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 282 కిమీల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఇందుకోసం 8 గంటల సమయం పడుతుందని పేర్కొంటున్నారు. మరోపక్క, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రం కేవలం 40 కిమీల దూరంలో ఉన్నదని, గంటలో జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు. ప్రస్తుత సరిహద్దుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులు, అవసరమైన సరుకులు తరలించేటప్పుడు తరుచుగా తనిఖీలు, అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతం ఛత్తీస్‌గఢ్- ఒడిసా రాష్ట్రాలకు సమీపంలో ఉండటంతో పోలీసింగ్, శాంతిభద్రతల సమస్యలు కూడా తలెత్తుతున్నదని ఆరోపణలు ఉన్నాయి. ఇకపోతే భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం తెలంగాణలో ఉండగా, ఈ ఆలయానికి సంబంధించిన కొన్ని భూ ములు ప్రస్తుతం పురుషోత్తపట్నం ప్రాంతంలో ఉన్నాయి. ఈ దేవాలయ భూముల విషయంలో గతంలో అక్కడికి వెళ్లిన మహిళా ఇవోపై దాడి జరిగింది. ఇది శాంతిభద్రతల సమస్యగా మారింది. దేవాలయ నిర్వహణ సులభంగా ఉండేందుకు ఈ భూభాగాలను తిరిగి తెలంగాణలో కలపటం అత్యవసరం కూడా. ఈ భౌగోళిక సమస్య కొనసాగితే భద్రాచలం దేవాలయం అభివృద్ధి ప్రణాళికకు ఆటంకం ఏర్పడుతుందని ప్రభుత్వ వర్గాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాక, ఆ ఐదు గ్రామాలు ఐదో షెడ్యూలులో ఉండటంతో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు గిరిజనులకు అందటం లేదని గిరిజన నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ ఐదు గ్రామ పంచాయతీలు, 19 రెవెన్యూ గ్రామాలు తిరిగి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి కలపాల్సిన అసవరం ఉఎంతైనా ఉందని. కేంద్ర మంత్రి అమిత్‌షాకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఈ నెల 16 నుంచి జరగబోతతున్నాయి. ఈ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో.. ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి ఆయన ఓ లేఖ రాశారు. ఆ ఐదు గ్రామాల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదివరకే ఏపీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే ఇప్పుడు చంద్రబాబు కనుక నిర్ణయం తీసుకుంటే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. అందుకు ఆయన సానుకూలంగా ముందుకు రావాల్సి ఉంది.

## విశాఖ స్టీల్‌ను వదిలించుకునే కుట్రలు

**నక్కపల్లిలో స్టీల్‌ప్లాంట్ ప్రారంభించడంపై అనుమానాలు**

**సొంత గనులు కేటాయిస్తేనే విశాఖ స్టీల్‌కు మనుగడ**

**సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నరసింగరావు**

**విశాఖపట్టణ,ఏప్రిల్6 :** నక్కపల్లిలో స్టీల్‌ప్లాంట్ ప్రారంభించి 20 వేల ఎకరాల భూమి ఉన్న విశాఖ స్టీల్‌ను కబ్జా చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిట్టల్‌తో కుట్ర చేస్తున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి. హెచ్.నరసింగరావు ఆరోపించారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ప్లాంట్‌ని సిక్ ప్లాంట్‌గా మారుస్తున్నాయని అన్నారు. అనకాపల్లి నక్కపల్లి దగ్గర 'ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ ఇండియా' కంపెనీ శంకుస్థాపన గత నెలలో ఆర్భాటంగా జరిగింది. 2029 నాటికి 8.2 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని స్టీల్‌ఎ÷-లాంట్ ప్రారంభిస్తుందని ప్రకటించారు. రూ.1.5 లక్షల కోట్లతో లక్ష మందికి ఉపాధి కల్పిస్తారని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. మిట్టల్ యాజమాన్యంతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ముచ్చట్లు అందరూ వీడియోలో చూశాం. నక్కపల్లి దగ్గర స్వాధీనం చేసుకున్న రెండు వేల ఎకరాల్లో 24 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేయడం ప్రపంచ వింత అవుతుందన్నారు. పరిశ్రమలు అభివృద్ధి కావాలన్నా ప్రభుత్వ విధానాలే మూలం. ప్రైవేటీకరణ పేరుతో దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాన్ని మోడీ, చంద్రబాబు జోడీ అమలు చేస్తున్నదని,అందులో భాగంగా ఆర్సెలార్ మిట్టల్, జపాన్ నిప్పన్ ద్వయానికి సుమారు రూ.25 వేల కోట్ల రాష్ట్ర సంపదను హారతి పళ్ళెంలో పెట్టి సమర్పించడం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ద్రోహం చేయడమేనని అన్నారు. భూములను చౌకగా ఇవ్వడం, ఎన్.ఎం.డి.సి నుంచి గనులు ఇప్పించడం, నక్కపల్లి పోర్టును మిట్టల్‌కు కట్టబెట్టడం, విశాఖ స్టీల్‌కు విశాఖ ప్రజలకు నీరందించే 'ఏలేరు కాలువ' నుంచి 30 యం.జి.డి ల నీటిని మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు మళ్లించడం, 30 సంవత్సరాలు జీఎస్టీని రద్దు చేయడం, అన్నిటి కంటే ముఖ్యంగా యూనిట్ విద్యుత్తుకు ఒక్క రూపాయి వసూలు చేయడం ఏ విధంగా సబబు అవుతుందో పాలకులు చెప్పాలన్నారు. మరోవైపున 35 సంవత్సరాల నుంచి సమర్థవంతంగా నడుస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధించకపోవడం ఘోరం అన్నారు.. విశాఖ స్టీల్‌కు సొంత గనులు ఉంటే దేశంలోనే నెంబర్ వన్ స్టీల్ అవుతుంది. విశాఖ స్టీల్ నాణ్యత వల్ల విశాఖ స్టీల్ ఒక్కటే వరుసగా నాలుగు సంవత్సరాలు విదేశీ ఎగుమతులు చేసి లాభాలు ఆర్జించింది. కానీ 2021లో విశాఖ స్టీల్‌ను నూరు శాతం ప్రైవేట్‌కు అమ్మాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటి నుంచి ఎగుమతులు ఆగిపోయాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేక ఇనుప ఖనిజాన్ని మార్కెట్లో అత్యధిక ధరలకు కొనడంతో ముడి ఖనిజం కొనుగోలు వ్యయం 74 శాతానికి పెరిగింది. సెయిల్‌లో ముడి ఖనిజం కొనుగోలు వ్యయం 48 శాతంగా వుంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ అప్పులపై వడ్డీ రేటు 10 శాతం చెల్లిస్తోంది. సెయిల్‌కు 3.4 శాతం వడ్డీ రేటుగా ఉంది. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం కావాలని విశాఖ స్టీల్‌ఎ÷-లాంట్‌పై వేసిన భారాలు. 2025-26న కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ సుమారు రూ.1,800 కోట్లు నష్టాలు భరించింది. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ద్వారా ప్యాకేజి ఇప్పించి లాభాల్లోకి తెప్పించామని తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ఎ÷-లాంట్ కార్మికవర్గంపై తీవ్రంగా దాడి కొనసాగుతోంది. పనిచేస్తున్న వారిని పూర్తిగా నిరుత్సాహపర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. పర్మినెంట్ కార్మికుల నియామకాలు గత ఆరేళ్ల నుంచి లేవు. సుమారు 50 శాతం మందిని ఉద్యోగాల నుంచి రిటైర్మెంట్, వి.ఆర్.ఎస్ పేరుతో యాజమాన్యం బయటికి నెట్టివేసిందన్నారు. ప్లాంట్‌లో ముగ్గురు కార్మికులు పని చేయాల్సిన మూడు యంత్రాలను ఒకే కార్మికుడు నడుపుతున్నాడు. మాట్లాడితే చార్జిషీట్లు, వార్నింగ్ లెటర్లు ఇస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఎమర్జెన్సీ వాతావరణం నెలకొంది. అసలు జీతాల్లో సగం జీతాలే చెల్లిస్తున్నారని అన్నారు. ఇప్పుడు పని చేస్తున్న కార్మికులు, ఆఫీసర్లను తొలగించి తక్కువ వేతనాలకు కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రైవేటు వారికి అప్పగించడానికే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలుచేస్తున్నది. ప్రైవేట్ యాజమాన్యాలకు లాభాలు రావాలంటే ఉన్న కార్మికులను తొలగించాలి అనే విధానాన్ని కేంద్రం అమలుచేస్తున్నది. అందుకోసమే ప్రైవేటీకరించే ముందు ఈ పద్ధతులన్నీ కేంద్ర ప్రభుత్వం పథకం ప్రకారం అమలుచేస్తున్నదని ఆయన ఆరోపించారు. . ఈ తప్పుడు పద్ధతులు ఆపి కార్మిక హక్కులను అమలు చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని నరసింగరావు అన్నారు. .

## అమెరికా రెస్క్యూ ఆపరేషన్ సాహసోపేతం

**ట్రంప్‌కు నెతన్యాహు ప్రశంసలు**

**న్యూఢిల్లీ,ఏప్రిల్6 :** పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ, అమెరికా చేపట్టిన సాహసోపేతమైన రెస్క్యూ ఆపరేషన్‌పై అంతర్జాతీయంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదంలో చిక్కుకున్న అమెరికాకు చెందిన ఎఫ్-15 యుద్ధ విమాన సిబ్బందిని సురక్షితంగా కాపాడిన తీరును ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు కొనియాడారు. ఇరాన్ సరిహద్దుల సమీపంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో, సాంకేతిక కారణాల వల్ల లేదా శత్రు దాడుల వల్ల అమెరికాకు చెందిన ఒక ఎఫ్-15 యుద్ధ విమానం ప్రమాదానికి గురైంది. అయితే, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో అమెరికా సైన్యం మెరుపు వేగంతో స్పందించి, ఇరాన్ గగనతలాన శోధించి ఆ విమానంలోని సిబ్బందిని ప్రాణాలతో కాపాడిన సంగతి తెలిసిందే. ఈ విజయంపై నెతన్యాహు స్పందిస్తూ.. ఇది అమెరికా సైనిక సామర్థ్యానికి, అధ్యక్షుడు ట్రంప్ దృఢ నిశ్చయానికి నిదర్శనమని పేర్కొన్నారు. 'అమెరికన్ మిషన్ అత్యంత కచ్చితత్వంతో జరిగింది. పైలట్లను సురక్షితంగా తీసుకురావడంలో చూపిన ప్రతిభ అసాధారణం' అని ఆయన ప్రశంసించారు. ఈ క్లిష్ట సమయంలో అమెరికాకు ఇజ్రాయెల్ అండగా ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు.

## బంజారాలకు పార్టీలో తగిన ప్రాధాన్యం

### మాజీ ఐపిఎస్ డిటి నాయక్‌తో కవిత భేటీ



**హైదరాబాద్,ఏప్రిల్6 :** ఈనెల 25న కొత్త రాజకీయ పార్టీ ప్రకటించబోతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అందుకు తగినట్లుగా వ్యూహాలు రచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల సింగరేణి కార్మికులతో భేటీ అవ్వగా తాజాగా సోమవారం బంజారా నేతలను కలిశారు. రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ సహా పలువురు బంజారా ప్రముఖులతో కవిత భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని డీటీ నాయక్ నివాసానికి వెళ్లిన కవిత మర్యాద పూర్వకంగా వారితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తన కొత్త రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వాలని కవిత వారిని కోరారు. పార్టీ ఏర్పాటు నేపథ్యంలో బంజారా సమాజం కోసం ఏం చేయాలనే దానిపై వారితో కూలంకషంగా ఆమె చర్చించారు. ఆ సామాజిక వర్గానికి ఏం చేయాలో అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే బంజారాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే మొదటిసారి అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఏర్పాటు చేయబోయే పార్టీలో వారికి సముచిత అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బంజారా ప్రముఖులంతా తాము ఏర్పాటు చేయబోయే పార్టీకి సలహాలు, సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించాలనుకునే వారిని తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు.

## బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఊరూవాడా జెండా ఎగరేసిన పార్టీ శ్రేణులు**

**రాష్ట్ర కార్యాలయ వేడుకల్లో పాల్గొన్న అధ్యక్షుడు పివిఎస్ మాధవ్**

**పార్టీ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు**

**విజయవాడ,ఏప్రిల్6 :** ఏపీ వ్యాప్తంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా పార్టీ శ్రేణులు సంబరాలు చేపట్టారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకల్లో రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఎగురవేసి ... నాయకులు, కార్యకర్తలకు స్వీట్‌లు తినిపించారు మాధవ్. నేటి నుంచి గ్రామపంచాయతీల్లో బీజేపీ ఆధ్వర్యంలో 'మన ఊరు.. మన జెండా' పేరుతో కార్యక్రమం ప్రారంభంకానుంది. దేశంలో విచ్ఛిన్నకర రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేసిందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ అనేక రాష్ట్రాల్లో అధికారాన్ని చేపట్టిందన్నారు. పొత్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితి నుంచి సంపూర్ణ మద్దతుగా ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు బీజేపీ బలపడిందని చెప్పుకొచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక శత్రు దేశాలు దాడి చేసేందుకు కూడా వెనకడుగు వేశాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కుల, మత ఘర్షణలు లేవని తెలిపారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' నినాదంతో బీజేపీ అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే బీజేపీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. బీజేపీ నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసిందని సీఎం చంద్రబాబు పోస్టు చేశారు. 'భారతీయ జనతా పార్టీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్న ఈ పార్టీ.. మన సంస్కృతిని, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తూ, సమగ్ర అభివృద్ధి, దేశ సేవ కోసం నిరంతరం కృషి చేస్తోంది. పార్టీ వ్యవస్థాపక నేతల నుంచి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ తన నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసింది. ఆంధప్రదేశ్‌లో రెట్టింపు వేగంతో పనిచేస్తోన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్.. ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందిస్తూ, సహకార సమాఖ్య స్ఫూర్తికి ఉదాహరణగా నిలుస్తోంది. పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో.. దేశ సేవలో బీజేపీ మరిన్ని విజయాలు సాధించాలని, 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా మన ప్రయాణాన్ని మరింత బలోపేతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అంటూ సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

# మాజీ ఎంపీ సంతోష్ కుమార్‌కి గ్లోబల్ గ్రీన్ ఐకాన్ పురస్కారం

**బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో ఏప్రిల్ 17న ప్రదానం ;**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 6,( చట్టం బ్యూరో) :** పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ ఇగ్నైటెడ్ మైండ్స్ నిర్వాహకులు, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ కు ప్రతిష్టాత్మక గ్లోబల్ గ్రీన్ ఐకాన్ పురస్కారం దక్కింది. బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ లో ఏప్రిల్ 17న ఆయన ఈ పురస్కారం అందుకోనున్నారు. భారతదేశంలో పర్యావరణ ఉద్యమాన్ని అట్టడుగు స్థాయికి తీసుకెళ్లడంలో 'ఇగ్నైటింగ్ మైండ్స్' నిరంతర కృషి చేస్తున్నది. ముఖ్యంగా సంతోష్ కుమార్ ప్రారంభించిన "హరా హై తో భరా హై" (ఆకుపచ్చగా ఉంటేనే సిరిసంపదలు) నినాదంతో ముందుకొచ్చిన 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' దేశవ్యాప్తంగా పర్యావరణ బాధ్యతను ఒక సత్సంప్రదాయంగా మార్చింది. విద్యార్థులు, యువత, రైతులు, సామాన్యుల నుంచి జాతీయ స్థాయి సెలబ్రిటీల వరకు ఎంతోమంది ఈ ఉద్యమంలో భాగస్వాములై మిలియన్ల కొద్దీ మొక్కలు నాటారు.

**లండన్ లో వేడుక**

పర్యావరణ పరిరక్షణ,సుస్థిర అభివృద్ధి, వాతావరణ మార్పులపై పోరాడుతున్న ప్రపంచ స్థాయి నాయకులను గుర్తించి వారికి పురస్కారాలు అందిస్తున్న బ్రిటన్ సంస్థ హెలిన్ స్పార్క్ స్ట్రాటజీస్ యూకే లిమిటెడ్ ఏప్రిల్ 17న అంతర్జాతీయ కాన్ క్లేవ్ నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా బ్రిటన్ పార్లమెంట్ లోని హౌస్ ఆఫ్ లార్డ్స్ లో సంతోష్ కుమార్ కు 'గ్లోబల్ గ్రీన్ ఐకాన్' పురస్కారాన్ని అందజేస్తారు.

**సమిష్టి కృషికి దక్కిన గౌరవమిది**

?ఈ గౌరవం పట్ల జోగినపల్లి సంతోష్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ, ఇది తన ఒక్కడికి దక్కిన గౌరవం కాదని, పర్యావరణ పరిరక్షణ కోసం శ్రమిస్తున్న ప్రతి ఒక్కరిదని పేర్కొన్నారు.
ఈ అంతర్జాతీయ గుర్తింపుపై 'ఇగ్నైటింగ్ మైండ్స్ ఆర్గనైజేషన్' స్పందిస్తూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆదర్శాలతో పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసి భావితరాలకు పచ్చని భూమిని అందించడమే తమప్రధాన లక్ష్యమని పేర్కొన్నది.



## సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్‌కి పరామర్శ



ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 6 ,(చట్టం బ్యూరో) సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ కు ఇటీవల గుండె పోటు రాగా కొత్తపల్లి కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్ వారిని పరామర్శించారు. వారు వారి యొక్క ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపెల్లి పట్టణ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## జూబ్లీనగర్ కవల ఆడపిల్లల హత్య కేసు ఛేదన: కన్నతండ్రితో సహా నలుగురు నిందితుల అరెస్ట్ ;



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా /ఏప్రిల్ 6 ,(చట్టం బ్యూరో) :** సొంత బిడ్డలనే కాలయముడిలా మారి బావిలో ముంచి చంపిన దారుణ ఘటనలో కన్నతండ్రితో పాటు అతనికి సహకరించిన కుటుంబ సభ్యులను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆస్తిపై మక్కువతో, ఆడపిల్లలనే వివక్షతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు విచారణలో వెల్లడైంది.

## నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారిని కలిసిన శింగనమల టీడీపీ నేతలు





**నార్పల ఏప్రిల్ 6, (చట్టం) న్యూస్**
అనంతపురం జిల్లా కి సీఎం నారా చంద్రబాబు నాయుడు గారు విచ్చేస్తున్న సందర్భంగా విచ్చేసిన నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గారు,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు గారు,జిల్లా ాణజజ బ్యాంకు చైర్మెన్ ముంటిమడుగు కేశవరెడ్డి గారు ఈ సందర్భంగా శింగనమల నియోజకవర్గం లో నీటి సమస్యలు పరిష్కారం చూపాలి అని వినతిపత్రం అందజేశారు .

## కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా గుర్రాల సురేష్ నియామకం

**డిసిసి ఉమా మురళి నాయక్ ప్రతిపాదన**

**పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ ఉత్తర్వులు జారీ**



**మహబూబాబాద్, ఏప్రిల్ 6 (చట్టం):** మహబూబాబాద్ జిల్లా, జంగిలిగొండ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు, విద్యావేత్త శ్రీ గుర్రాల సురేష్ ను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమిస్తూ తెలంగాణ పీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించి, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (ఐజజ) అధ్యక్షురాలు శ్రీమతి డా. ఉమా మురళీ నాయక్ ప్రతిపాదన మేరకు ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గుర్రాల సురేష్ గారు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ గారికి, మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. మురళీ నాయక్ గారికి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు డా. ఉమా మురళీ నాయక్ గారికి, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేవరం ప్రకాశ్ రెడ్డి గారికి, జంగిలిగొండ గ్రామ సర్పంచ్ గుండెల రేణుకా రాజు గారికి మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## హామీలను అమలు చేసిన ఘనత మాది

**పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీలకు కార్యరూపం**

**మాకు వ్యక్తిగత ఎజెండా లేదన్న భట్టి విక్రమార్క**

ఆదిలాబాద్,ఏప్రిల్6 : అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు.
పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ. 1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ. 22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగు తున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ. 5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవని భట్టి విక్రమార్క అన్నారు.
------

# బాసర జ్ఞానసరస్వతి ఆలయ విస్తరణ

- **225 కోట్లతో అధునాతనంగా పునర్నిర్మాణం**
- **ఆధునీకరణ పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపన**
- **ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహణ**
- **మనవడికి అక్షరాభ్యాసం చేయించిన సిఎం**

**నిర్మల్,ఏప్రిల్6 :** నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం.. మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. తర్వాత ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. రూ. 225 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని పునరభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఈ ప్లాన్‌లో ఆలయ రీడెవలప్‌మెంట్ నమూనాలోని ఒక భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. దక్షిణ భారతదేశంలోని ఏకైక జ్ఞాన సరస్వతి ఆలయం.. అక్షరాభాస్యాలకు ఆలవాలమైన క్షేత్రం పునఃనిర్మాణంతో కొత్త శోభను సంతరించుకోబోతోంది. వేద వ్యాస మహర్షితో ప్రతిష్టతమైన ముగ్గురు అమ్మల ఆలయం ఆచారాలకు అనుగుణంగా సమున్నతమైన రాజగోపురం.. కోనేరు.. ఉత్తర ద్వారం అభివృద్ధి.. ధ్యాన మందిరాలతో మరింతగా భక్తుల మనస్సులను ఆకట్టుకోనుంది. వేల ఏళ్ల ఘన చరిత్ర గల్గిన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునః నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 225 కోట్లను కేటాయించింది. పునః నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. దక్షిణ గంగగా గుర్తింపు పొందిన పవిత్ర గోదావరి నదీ తీరంలోని బాసర క్షేత్రంలో జ్ఞాన సరస్వతి దేవి కొలువై ఉన్నారు.. కురుక్షేత్ర యుద్ధానంతరం ప్రశాంతత కోసం వేద వ్యాస మహర్షి గోదావరి తీరానికి వచ్చి బాసరలో నివసించారని ప్రశస్తి. ఆ సమయంలో స్వయంగా ఆయనే గోదావరి ఇసుకతో జ్ఞాన సరస్వతితో పాటు మహాలక్ష్మి, మహాకాళి అమ్మవార్ల మూర్తులను ప్రతిష్టించారనేది స్థల పురాణం.. అలా ముగ్గురమ్మల కొలువైన క్షేత్రంగా బాసర ప్రసిద్ధి చెందింది. జ్ఞాన సరస్వతి కొలువైన క్షేత్రం కావడంతో ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో పిల్లలకు ఇక్కడ అక్షరాభ్యాసాలు చేయిస్తుంటారు. వసంత పంచమి, ఇతర పర్వ దినాల్లో అక్షరాభ్యాసాలకు వచ్చే పిల్లలు, తల్లిదండ్రులు, వారి బంధువులు, భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. ప్రాచీన ఆలయం కావడం.. ఏటేటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగినట్లు అభివృద్ధి పనులు చేపట్టపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.. ఈ నేపథ్యంలో బాసర ఆలయ అభివృద్ధి చేపట్టాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బాసర ఆలయ పునఃనిర్మాణ



పనులకు మాస్టర్ ప్లాన్ రూపొందించే ముందు అధికారులు శృంగేరి పీఠాధిపతులతో సంప్రదించారు.. గర్భాలయం, అర్ధ మండపం, రాజగోపురం, ఇతర గోపురాలు, మాడ వీధులు, కోనేరు, ఉత్తర ద్వారాల నిర్మాణాలకు సంబంధించి పీఠాధిపతుల అనుమతులు తీసుకున్నారు.. వారి సూచనలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. భక్తుల సంఖ్య.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధ మండపాన్ని 5 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఉత్తరం వైపున 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అతంస్తుల గోపురాలు, 33 అడుగుల వెడల్పుతో నాలుగు దిక్కుల మాడ వీధులు, ఉత్తర ద్వారం నిర్మించనున్నారు. మొత్తంగా ఆలయ విస్తీర్ణాన్ని 20 వేల చదరపు అడుగుల నుంచి 62 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఆలయంలో ప్రతి నిర్మాణాన్ని శిలలతో చేపట్టనున్నారు. 6 వేల మంది భక్తులకు అన్ని వసతులతో 70 వేల చదరపు అడుగులతో క్యూ కాంప్లెక్స్‌లు, 200 మంది ఏకకాలంలో కూర్చొని ధ్యానం చేసుకునేలా ధ్యాన మందిరం, 20 వేల చదరపు అడుగుల వైశాల్యంతో వంటశాల, భోజన శాలలు, ప్రసాద పంపిణీ కేంద్రం, ఈశాన్య దిక్కున కోనేరు తూర్పు దిక్కున ఆధ్యాత్మికత పరిఢవిల్లేలా అద్భుతమైన తోరణాలు, సమాచార కేంద్రం, దేవాలయానికి ఉత్తర, తూర్పు దిక్కుల్లో రోడ్ల అభివృద్ధి, దేవాలయం నుంచి ఆవతలి వైపు వెళ్లేందుకు అండర్ పాస్, ఆవతలి వైపున సోలార్ రూఫ్‌టాప్‌తో వాహనాల పార్కింగ్, దేవాలయ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన మొక్కలతో పుష్పవనం పనులు చేపట్టనున్నారు. ఆలయ ప్రాంగణం ఆవల హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.. భవిష్యత్‌లో ఆలయం వెనుక భాగం భారీ వృక్షాలతో ఆలరారేలా మొక్కలు నాటనున్నారు.. గోదావరి నది పుష్కరాలు వచ్చే ఏడాది జూన్ లో ప్రారంభంకానున్నాయి. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలకు బాసర గోదావరి తీరానికి చేరకుంటారు. వారికి అవసరమైన అన్ని వసతులు ప్రస్తుత మాస్టర్ఎ÷-లాన్‌లో భాగంగా చేపట్ట నున్నారు. ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా అదే సమయంలో ఆలయ సంప్రదాయాలు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

95814 19999
# చట్టం సాహితీ లోకం

## జీవితమే శూన్యం!



సొంత కష్టంతో బ్రతికేవాడు
ఎవ్వరికీ తలవంచడు
తమ సొంత కష్టాన్ని
శ్రమను నమ్ముకున్న వాడు
ఎవ్వరి మీద ఆధారపడడు
ఒకరి మీద ఆధారపడి
బ్రతకాల్సిన అవసరం లేదు
భయం ఉన్నంత వరకే
అతడు ఒక మనిషి
భయాన్ని కాల్చేసిన క్షణం
అతడు ఒక యోధుడు
అతని చేతిలో కర్మకాలి
కాలచక్రం తిరగబడితే మాత్రం
అనంత లోకాలలో కూడా
నీ ఆత్మకు అరుపులు
నీ గొంతులో కేకలు
దానిపేరే కర్మ సిద్ధాంతం
నువ్వు తొందరపడకు
విర్రవీగకు చిన్నోడా!
నీకు సమయం ఆసన్నమైంది
ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు
కళ్లకు కనిపించని కపటం
మనుషుల్లో దాగి ఉంటుంది
జాగ్రత్తగా ఉండకపోతే
మోసపోయి సర్వనాశనం
అయిపోవడం ఖాయం
నీ వెనుక గొయ్యి
అది తొవ్వే వాడికి తెలియదు
వాడి వెనుక కర్మ అనేది ఒకటి
అంతకంటే పెద్ద గొయ్యి
తొవ్వుతూ ఉంటుందని
ఆ గొయ్యిలో పడితే మాత్రం
ఇక జీవితమే శూన్యం.

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

95814 19999
# చట్టం సాహితీ లోకం

## జన్మదినోత్సవ శుభాకాంక్షలు



ఖమ్మం కాంతిరేఖలు
సత్తుపల్లి సరదాలు

అమెరికా అపురూపాలు
వర్జీనియా వజ్రాలు

మేరీలాండ్ మమతలు
మేనమామ ల మురిపాలు

తాతయ్య "నాని" ల తందనాలు
అమ్మమ్మల అనురాగాలు

మౌనిక ఆశా కిరణాలు
కోటేశ్వర్ కోటి ఆశలు

శ్రావణి చల్లని చూపులు
చైతన్య చిత్ర విచిత్రాలు

నిర్విక నిరాడంబరాలు
దర్శిత దయా గుణాలు
దృ సాయి దుదుకుతనాలు

అందరి ఆనందాలు
అపురూప సౌందర్యాలు

ప్రేమతో తాతలు,నాని, అమ్మమ్మలు
దివ్య హస్తముల దీవెనలు

జన్మదినోత్సవ వేడుకలు
శుభకరముల శుభాకాంక్షలు

రచయితలు :-- తాతలు, నాని,
అమ్మమ్మలు
కోదాడ 98484 32533

95814 19999
# చట్టం సాహితీ లోకం

## వివక్షతా ఓవివక్షతా..వివక్షతా నీవు లేనిదెక్కడ?..



మాతృ గర్భములోన మసలినాను
ఎలాగో భ్రుణ హత్యలు తప్పించుకున్నాను
సమాజమన్నో ఆడపిల్ల వంటూ అనగదొక్కింది
అబలవు నీవంటూ కుటుంబం మానసికముగా
పాతాళానికి పంపుతున్నది

త్రిభువనాలను ఏలుతున్నా ఎందుకు పనికి రావంటారు
త్రిశూలధారిణిలు మేమైనా త్రిశంకు స్వర్గం మాది
పదవిమాదైనా అధికారం మరొకరిది
వివక్షత విషవృక్షమైనేడు వ్యాపించినది

కులం లోన వివక్షత గుణం లోన వివక్షత
రంగులోన వివక్షతరూపంలోన వివక్షత
పేదధనికుల మధ్య వివక్షత పదవిలోన వివక్షత
పూజారుల మధ్య వివక్షత పూజలలోన వివక్షత

ప్రేమలోని వివక్షత పైసలలో వివక్షత
విద్యలో వివక్షత వైద్యం లో వివక్షత
సమన్యాయం లో వివక్షత
సరుకుల పంపిణీ లో వివక్షత
నీటిలోను నింగిలోనూ వివక్షత

పొలంలో వివక్షత హలంలో న వివక్షత
తాగు నీటిలో వివక్షత సాగునీటిలో వివక్షత
కన్నుమూసి కాటికెలితే కాటిలోనూవివక్షత
కప్పి పెట్టు కాల్చి పెట్టు చోటులలో వివక్షత

అలనాడు అంబేద్కర్ అందించిన సమాన హక్కులు
ఔతున్నవి ధన బలమున్న వారి రక్షకులు
రాజ్యాంగం మాకెన్ని రక్షణలు కల్పించినా
అనుభవించుటకు చూపుతున్నారులొసుగులు

తరతరాలమధ్యలో అంతరాలవివక్షత
అనగదొక్కడాలు అణచి వేతలుగా
ఎక్కడ పడితే అక్కడ నీవు కనపడుతున్నావు
నీవు లేనిదెక్కడో చెబితే నేనక్కడుంటాను

డాక్టర్ కవి కోకిల కొఠారి వెంకటరత్నం,
విశ్రాంత ఉపాధ్యాయులు,
కవి రచయిత.
వి. కోట. చిత్తూరు జిల్లా.
9000169823.

95814 19999
# చట్టం సాహితీ లోకం

## అందమైన అక్షరాల కలయిక పదములు

**(వెన్నెల జల్లులు)**



పదముల పొందిక గాదే సుందర కవనము,

అన్నింటి కన్న మిన్న అక్షర ధనము,

అదియే భగవాను డిచ్చిన గొప్ప మూలధనము,

మంతు చదువు ఇచ్చును శాస్త్రీయ విజ్ఞానమును,

మంచి పదములు తెచ్చునుగ వినయ విధేయతలను!!

డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి, చెన్నై

95814 19999
# చట్టం సాహితీ లోకం

## నన్నపార్యుడు ఆదికవి- ఆంధ్ర కవితకు మార్గదర్శి



1.
ఆంధ్ర వాఙ్మయమందు నన్నయ
ఆదికవిగా ఖ్యాతిగాంచెను
రాజరాజ నరేంద్రు
కోరగ వ్యాసభారతమనువదించెను

2.
తొలుత సంస్కృత శ్లోకమందున
మూడుమూర్తుల స్తుతులు జేసెను
భారతాంధ్రీకరణ మందున
తనదు కవితా లక్షణాలుగ

3.
"అక్షర రమ్యతయు, ప్రసన్న క
థా కవి తార్థ యుక్తి, నానా
రుచిర అర్థ సుసూక్తినిధియును"
తాను నుడివెను అట్లె వ్రాసెను


4.
ఆది,సభ పర్వములు, అరణ్య
పర్వము అర్థభాగము వ్రాసె
ఆది కవిగా, శబ్ద శాసన
బిరుదులందెను బాటవేసెను.

5.
తొలుత కావ్య రచనకు పునాది
కవి త్రయమున నన్నయె ఆది
ధర్మ శాసన రచన చేసిన
ఆంధ్ర కవితకు మార్గదర్శియె!

రచన:
మహేంద్రాడ సింహాచలాచార్య (టెక్కలి)
శ్రీకాకుళం జిల్లా


95814 19999
# చట్టం సాహితీ లోకం

## లోయ రాళ్లు :



లోయ లోతుల్లో
రంగురాళ్ళలా
నెలకొన్న వింతరూపాలు
అద్భుత దృశ్య నిలయాలు
హృదయ గుండెల్లో
రంగులవల్లుల ఆలోచనలు బండ పాకురులే
నిరంతర జ్ఞాపకాలు
అలల తాకిడికి శిలలై
వెలసిన రాళ్లవలె
హృదయం పగిలి
కండ్లలో నిలిచిన
కన్నీటి ప్రవాహాలు
ఎన్నెన్నో కష్టాలను
దాటుకుని
నిచ్చల అభివృద్ధి
నిచ్చెనలై నిలిచాయి
రూపం లేని మొండిరాళ్లే పునాదిరాళ్ళైనట్టు
ఒడిదుడుకుల
నా జీవితం చరిత్ర పాఠాలై
అలలా మనుషుల
జీవితాలను
తాకాయి...
హృదయ గాయాలే
నిజాయితీ లేపనాలు
లోయల్లో రాళ్లు
రాపిడికి నిలిచాయి
కోతలకు వెలిచాయి
అలలకు అరిగాయి
తీరాల్లో చక్కని
రూపాలై మెరిసాయి
కొన్ని కోవెల్లో
కొలువు తీరాయి
హృదయాల్లో ఆనందాలు
పంచే రంగురాళ్లుగా మిగిలాయి ...
అలల తాకిడి తాకిన
మొండి రాళ్లే రంగుల రాళ్ళై కష్టాలను అరించే
ముత్యాల రాళ్లుగా
చేతి ఉంగరాలుగా
అదృష్టాన్ని పరీక్షించే అంగుళికాలుగా
దిక్సూచిలై
దరిద్రాలను పోగొట్టే
నమ్మకమైన
మానవ అంగుళీకాలుగా రాజులఅంతపురాల
రాణి రాజుల కరములోంచి...
నిలువెత్తు
ఆభరణములుగా
మానవ దేహాన్ని
చేరినట్టే కష్టాల
కన్నీటి పర్యంతాల
నా పరిమళ జీవితం
మానవ జీవితంలో
అనుభవ పాఠశాలగా నిర్మాణమైంది...
కండ్లు కురియాగ
ముఖంపై ఉప్పును
గుర్తు తెలుసుకున్న
అమూర్త ఘడియలు
నా జీవితపు నిర్మాణ
ఏటి రాళ్లు
కొండలే కరిగి
విలువైన ఎల్లోరా
శిల్పాల్ల నిలిచినట్లే
గుండెలు పగిలి
మండే సూర్యున్నైతిని
ఈ మానవ జాతికి
జ్ఞాన వెలుగులు
ఉదయభానుడనై
సంతోషాన్ని పంచే
సింధూరమై...
నుదిటి భాషికాలుగా
మానవశిరస్సులు చేరితి
లోయరాళ్లు ఏటి రాళ్లే
మన జీవిత అనుభవల
విశ్వవిద్యాలయాలు...
అనుభవమును మించిన విద్యాలయం లేదు..
ఆకృతిని మించిన
ఆలోచన లేదు...
కాలగమనములో
ఏర్పడ్డ చక్కని లోయరాళ్లవలే...
నా అపజయాల
అనుభవాలే....
నా జీవిత
విజయ నిర్మాణాలు..
ఏటి రాళ్ల ఓర్పును
పరీక్షించు...
నీ జీవితాన్ని నిర్మించు.

డాక్టర్: కందుల సుధాకర్ తెలంగాణ కేసరి
సేవ రత్న
సోషల్ రిఫార్మర్, స్వర్ణ నంది అవార్డు గ్రహీత.
ఖమ్మం జిల్లా 9390708322.



95814 19999
# చట్టం సాహితీ లోకం

## వృత్తిధర్మం!



లోకంలో ప్రజలందరికీ...
వృత్తులు అనేకములు ఉన్నవి!
వారివారి చిత్తమును బట్టి...
ఎవరికి వారు ఏర్పరచుకున్నవి!

ఎవరి వృత్తి వారికి దైవం
వారు తప్పక ఆచరించదగినవి!
నాటి నుండి నేటి వరకు
మన పెద్దలు అనుసరిస్తున్నవి!

ప్రతీ పనికి ఒక ప్రత్యేక వృత్తి
ఆవశ్యకము అయి ఉన్నది!
తరతరాల ఆస్తిగా ఆవృత్తిని
తమ వారసులకందించినది!

కులవృత్తులు చిరకాలం
కాలగతిలో నడిచినాయి!
సమాజ మనుగడలో మిక్కిలి
సహకారము అందించినాయి!

మారిన కాలంలో కులవృత్తులు
కనుమరుగైపోతున్నాయి!
వృత్తిధర్మాలు విడిచిపెట్టి
మనుషులు జీవిస్తున్నారు!

కొత్త కొత్త వృత్తులెన్నో
నేడు రూపుదిద్దుకున్నాయి!
వివిధరకాల రంగాలలో
ఉపాధిని కల్పిస్తున్నాయి!

ఏ వృత్తిని చేపట్టినా
వృత్తిధర్మం మరువరాదు!
వృత్తికున్న విలువను
ఏ ఒక్కరూ పోగొట్టరాదు!

ఈ.వి.వి.ఎస్. వర ప్రసాద్
కవి, తెలుగు ఉపాధ్యాయుడు
తుని. (కాకినాడ జిల్లా)
కలం పేరు : వరశ్రీ

95814 19999
# చట్టం సాహితీ లోకం

## ఏది మంచో ఆలోచించు ...?



ఏమిటో
మన పిచ్చిగాని
ఏవీ శాశ్వతం కాదు
మనతో పాటుగా

ఐనా
ఎంతో తాపత్రయం
ఎన్నో మోసాలు
ఎన్నో దగాకోరు పనులు

వ్యక్తిత్వాన్ని
మంటగలిపేసుకుని
నిజాయితీని
నిలువునా కప్పెట్టేస్తూ

అవినీతితో
అడ్డదారులు తొక్కేసి
కోట్లను సంపాదించినా
కంటి నిండా కునుకేది

రాజైనా
బంటైనా
చివరికి వెళ్ళేది
రుద్రభూమికే కదా

మరి
దేనికోసం నీ పరుగు
ఆగి ఆలోచించు
విజ్ఞతతో మసలుకో

పరులకోసం
కొంత మేలైనా తలపెట్టు
కొందరినైనా ఆదుకో
ఆనందం నీ తోడవుతుంది ...!

గట్టి బ్రహ్మాజీ
రిటైర్డ్ సబ్ పోస్టు మాస్టర్
ర్యాలి
డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

95814 19999
# చట్టం సాహితీ లోకం


## అష్టైశ్వర్యాలా అవెక్కడ?



అరవై ఏండ్ల క్రిందట వివాహామై
తాతయ్య నానమ్మలకు నమస్కరిస్తే
ఉన్నతుడవై ఆయురారోగ్య పిల్లాపాపాలతో
సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో
శతమానం భవతిగా
తనలా జీవించమని ఆశీర్వదించినది జ్ఞాపకమే.

నేడు చదువుకున్నా సంస్కారం అన్నది లేకుండా
దయ కరుణ జాలి లేకుండా
అన్ని బంధాలు ఆర్థికబంధాలుగా మారి
ఈర్ష్య అసూయాలతో గడిపి
సుఖ సంతోషాలు కరువై
కడుపున పుట్టిన పిల్లలు కూడ
ప్రయోజకులై ఉన్నతస్థితికి చేరినా
తల్లిదండ్రులను చూడక వృద్ధాప్యంలో ఉంచి
అనురాగ ఆప్యాయతలు లేని
అనుబంధాలన్నవి మరచి
మానవత్వం లేక
ఆశాశ్వతమైన శరీరం గురించి శాశ్వతమనుకుని
నడి వయస్సులోనే రోగాల బారిపడి
అనుకున్న ఆహారం తినలేక
కంటినిండా నిద్రలేని పరిస్థితులలో
'అష్టైశ్వర్యాలా అవెక్కడ?'
గతకాలమే మేలు వచ్చు కాలం కంటెన్ అన్న
ఆదికవి నన్నయ్య చెప్పినది అక్షరసత్యం!!
............................

కవి మిత్ర, సాహిత్య రత్న
ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్.
(పుష్యమి)
విశాఖ పట్నం




# గాయపడ్డ సింహం..ఓ మంచి పాత్రలో కనిపిస్తా

## నటుడు జెడి చక్రవర్తి



కమల్ హాసన్ చేసినన్ని పాత్రలు సినీ చరిత్రలోనే ఎవరూ చేసి ఉండరని నటుడు జేడీ చక్రవర్తి అన్నారు. తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గాయపడ్డ సింహం' మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో జేడీ చక్రవర్తి కీలకపాత్రలో నటించారు. ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ తన పాత్ర గురించి చెప్పారు. 'నటులందరికీ కమల్ హాసన్ నటనే ఒక బెంచ్‌మార్క్. ఆయన చేసినన్ని పాత్రలు ప్రపంచ సినీ చరిత్రలో ఎవరూ ఇప్పటివరకూ చేయలేదు. ఇకపై కూడా ఆయన్ని బీట్ చేయడం కష్టమే. ఒక నటుడిగా నేను ఆయనకు ఏ విషయంలోనూ సరితూగను. ఆయనకు రాని అదృష్టం నాకు ఈ సినిమా రూపంలో దక్కింది. ఇందులో నాది అంత గొప్ప పాత్ర. చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఇప్పటివరకూ కమల్ హాసన్ కూడా చేయని పాత్ర ఇది. కెరీర్‌లో చాలామందికి జయాపజయాలు ఉండొచ్చు. కానీ, ప్రతిఒక్కరికీ కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర ఒకటి ఉంటుంది. నాకు 'మనీ', 'అనగనగా ఒక రోజు' చిత్రాలు ఎప్పటికీ ప్రత్యేకమే. మళ్లీ చాలా ఏళ్ల తర్వాత ఆ సినిమాల్లో పోషించిన లాంటి పాత్ర వచ్చింది' అని జేడీ చక్రవర్తి చెప్పారు. 'గాయపడ్డ సింహం'లో ఎంతోమంది దర్శకులు నటించారని ఇది దర్శకుల చిత్రమని ఆయన అన్నారు.

# వారాణాసిలో మరో బాలీవుడ్ నటి ?

మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ 'వారణాసి'. ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్. మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ మూవీ పై రోజుకో ఆసక్తికర వార్త బయటకు వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్ బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)లపై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియగానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. ఏప్రిల్ 7, 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.





# రాకాసకు మంచి ఓపెనింగ్స్

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. తాజాగా ఆమె నిర్మించిన 'రాకాస' సినిమా విడుదలైన తొలి రోజునుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోంది. 'రాకాస' చిత్రాన్ని ఓటీటీ సిరీస్‌లతో గుర్తింపు తెచ్చుకున్న మానస శర్మ తెరకెక్కించారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్ హీరోగా నటించగా, నయన్ సారిక హీరోయిన్‌గా మెప్పించారు. హారర్, కామెడీ, ఫాంటసీ మేళవింపుతో రూపొందిన ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి కీలక పాత్రల్లో నటించారు. ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదలైన 'రాకాస' సినిమా, గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌తో ముందుగానే మంచి అంచనాలు ఏర్పరచుకుంది. విడుదలైన తర్వాత ఆ అంచనాలను మించి ప్రేక్షకులను అలరించడంతో తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఓవర్సీస్‌లో కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'రాకాస' సినిమా కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.10.30 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. శుక్ర, శనివారాల్లో వచ్చిన రెస్పాన్స్ ఆదివారం మరింత పెరగడంతో వసూళ్లు వేగంగా పెరుగుతున్నాయి. ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనంగా, విడుదలైన తొలి 24 గంటల్లోనే 60 వేలకుపైగా టికెట్స్ అమ్ముడవడం విశేషం. డిఫరెంట్ ప్రమోషనల్ స్ట్రాటజీ కూడా సినిమాకు ప్లస్ అయిందని ట్రేడ్ సర్కిల్స్ అభిప్రాయపడుతున్నాయి.

ఇప్పటికే నిర్మాతగా 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న నిహారిక, 'రాకాస'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నట్లు కనిపిస్తోంది. జీ స్టూడియోస్ సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. సంగీత్ శోభన్ కామెడీ టైమింగ్, నయన్ సారిక గ్లామర్, సపోర్టింగ్ క్యాస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ కలిసి సినిమాకు మంచి ప్లస్ అయ్యాయి. ముఖ్యంగా హారర్ కామెడీ జానర్‌ను కొత్తగా ప్రెజెంట్ చేయడంపై ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. 'రాకాస' సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి జోరు చూపిస్తూ, నిహారిక కొణిదెలను విజయవంతమైన నిర్మాతగా మరోసారి నిలబెడుతోంది.



# పెద్ది డిజిటల్ హక్కుల కోసం నెట్‌ఫ్లిక్స్ పోటీ




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం రిలీజ్‌కు ముందే టాలీవుడ్‌లో సంచలనాలు సృష్టిస్తుంది. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ అంచనాలను మరింత పెంచేలా ఓటీటీ హక్కుల విషయంలో భారీ డీల్ కుదిరినట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'పెద్ది' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం ఏకంగా రూ.130 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు ఇతర భాషల హక్కులు కలిపి ఈ డీల్ కుదిరిందని చెబుతున్నారు. ఒక తెలుగు సినిమా కేవలం ఓటీటీ రైట్స్ ద్వారానే ఇంత భారీ మొత్తాన్ని రాబట్టడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.

ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే, సినిమా థియేటర్లలో సాధించే విజయాన్ని బట్టి అదనంగా రూ.20 కోట్ల బోనస్ ఇవ్వాలని కూడా నెట్‌ఫ్లిక్స్ ప్రతిపాదించిందట. అంటే 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిస్తే, మొత్తం డిజిటల్ డీల్ విలువ రూ.150 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇది రామ్ చరణ్‌కు ఉన్న గ్లోబల్ మార్కెట్ క్రేజ్‌ను మరోసారి నిరూపిస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఈ కాంబినేషన్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుని, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ 'పెద్ది పహిల్వాన్'గా, అలాగే క్రికెటర్‌గా రెండు భిన్నమైన షేడ్స్‌లో కనిపించబోతున్నాడు. నటన, బాడీ లాంగ్వేజ్ పరంగా ఇది ఆయన కెరీర్‌లో మరో కొత్త ఛాలెంజ్‌గా భావిస్తున్నారు అభిమానులు. ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, థియేటర్లలో విడుదలైన నాలుగు వారాల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా, రిలీజ్‌కు ముందే భారీ డీల్‌తో 'పెద్ది' సినిమా ట్రేడ్ వర్గాల్లోనే కాకుండా అభిమానుల్లోనూ భారీ హైప్ క్రియేట్ చేస్తోంది.

# లవ్ ఇన్సూరెన్స్ కంపెనీకి ఓటిటి పోటీ

లవ్‌టుడే, డ్రాగన్ , డ్యూడ్ సినిమాలతో సూపర్ హిట్స్‌ను ఖాతాలో వేసుకున్నాడు తమిళ యాక్టర్ ప్రదీప్ రంగనాథన్. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ తాజాగా విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ చిత్రంలో నటిస్తున్నాడు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ ఏప్రిల్ 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. థియాట్రికల్ రిలీజ్‌కు ముందే ఈ మూవీకి డిజిటల్ ప్లాట్‌ఫాంలో కూడా మంచి డిమాండ్ ఏర్పడింది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియోతో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఓటీటీ డీల్ కుదిరినట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. నాలుగు వారాల థియాట్రికల్ రన్ తర్వాత మిడ్ మేలో ఈ మూవీ ఓటీటీ డెబ్యూ ఇవ్వనుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే రిలీజ్ చేసిన ట్రైలర్‌లో ప్రపంచం ఎక్కడికో వెళ్లిపోయింది.. మనమిప్పుడు 2040లో ఉన్నాం. కానీ ఒకడు లేని ఒక విషయాన్ని ఉందనే అంటున్నాడు.. ఉందండి.. ఈ లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ ఇంకా ఉందండి. అది ఈ అమ్మాయిని చూడగానే అర్థమైంది. తల నుంచి కాలి వేలి వరకు ఒక ఫీలింగ్ వచ్చింది మామ.. అంటూ సాగుతున్న డైలాగ్స్ యూత్ ఫుల్ స్టోరీతో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు చెబుతున్నాయి. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ చిత్రం విడుదల కానుందని ఇప్పటికే మేకర్స్ తెలిపారు. ఈ మూవీని రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియో బ్యానర్లపై ఎస్ ఎస్ లలిత్ కుమార్‌తో కలిసి నయనతార తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, యోగి బాబు, సీమాన్, గౌరీ కిషన్, షారా కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

భవిష్యత్‌లో(2040) ప్రేమ ఎలా ఉండబోతుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుందని టీజర్‌లో హింట్ ఇచ్చింది విఘ్నేశ్ శివన్ టీం.





## లవ్ ఇన్సూరెన్స్ ప్రేక్షకులకు నచ్చుతుంది: దిల్ రాజు

'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అంటూ ప్రేక్షకులను కొత్త కాన్సెప్ట్ మూవీతో అలరించేందుకు సిద్ధమయ్యారు ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి. వీరిద్దరూ జంటగా నటించిన ఈ చిత్రాన్ని విఘ్నేశ్ శివన్ తెరకెక్కించారు. నయనతార, ఎస్ఎస్ లలిత్ కుమార్ నిర్మించారు. ఈనెల 10న రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు దిల్ రాజు, అనిల్ రావిపూడి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ.. ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ టుడే' ప్రేక్షకులకు నచ్చుతుందని ముందే ఊహించినట్లు తెలిపారు. అందుకే తెలుగులో డబ్ చేయించినట్లు చెప్పారు.

# భువనేశ్వర్ కుమార్ సరికొత్త రికార్డు



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో ఒక అద్భుతమైన మైలురాయి నమోదైంది. 'స్వింగ్ కింగ్'గా పేరొందిన భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. ఆదివారం రాత్రి ఎం. చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో భువీ ఈ అరుదైన ఘనతను సాధించారు. ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్ల మార్కును అందుకున్న తొలి భారతీయ వేగవంతమైన బౌలర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన హై-వోల్టేజ్ పోరులో భువనేశ్వర్ కుమార్ తన పాత ఫామ్‌ను గుర్తుకు తెచ్చారు. ఈ మ్యాచ్‌లో ఆయన 3 కీలక వికెట్లు పడగొట్టి చెన్నై బ్యాటింగ్ వెన్నెముకను విరిచారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో తన స్వింగ్‌తో బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన భువీ, ఐపీఎల్‌లో తన 200వ వికెట్‌ను సాధించి స్టేడియంను హోరెత్తించారు. ఈ ఘనత సాధించిన సమయంలో మైదానంలోని ఆటగాళ్లు, ప్రేక్షకులు ఆయనకు ఘనంగా అభివాదం చేశారు. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు 200 వికెట్ల మార్కును దాటిన బౌలర్లు చాలా తక్కువ మంది ఉన్నారు. యుజువేంద్ర చహల్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా, భువనేశ్వర్ కుమార్ ఇప్పుడు ఈ ఎలైట్ క్లబ్‌లో చేరారు. అయితే, ఒక పేసర్‌గా ఈ మైలురాయిని అందుకోవడం భువీకి దక్కిన ప్రత్యేక గౌరవం. గతంలో లసిత్ మలింగ (170) వంటి దిగ్గజ పేసర్లు కూడా ఈ మార్కును అందుకోలేకపోయారు. భువనేశ్వర్ కుమార్ కెరీర్‌లో మెజారిటీ భాగం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతోనే సాగింది. ఎన్నో ఏళ్లపాటు ఆ జట్టుకు ప్రధాన బౌలర్‌గా ఉండి, రెండుసార్లు 'పర్పుల్ క్యాప్' (అత్యధిక వికెట్లు తీసిన బౌలర్) గెలుచుకున్న ఏకైక భారతీయ బౌలర్‌గా నిలిచారు. 2026 మెగా వేలంలో ఆర్‌సీబీ ఆయనను సొంతం చేసుకోగా, కొత్త జట్టులో కూడా తన విలువేంటో భువీ నిరూపించుకున్నారు. ఈ అద్భుత ఘనతపై క్రికెట్ దిగ్గజాలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆర్‌సీబీ కెప్టెన్ మాట్లాడుతూ, "భువీ ఒక లెజెండ్. ఆయన అనుభవం జట్టుకు ఎంతో ప్లస్ అవుతుంది. 200 వికెట్లు తీయడం సామాన్యమైన విషయం కాదు, అది కూడా ఒక పేసర్‌గా చిన్నస్వామి వంటి స్టేడియాల్లో ఆడటం గర్వకారణం" అని కొనియాడారు. సోషల్ మీడియాలో కూడా 'భువీ 200' అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. 36 ఏళ్ల వయస్సులో కూడా భువనేశ్వర్ కుమార్ తన ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ యువ బౌలర్లకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన స్వింగ్ బౌలింగ్ ఇంకా చెక్కుచెదరలేదని ఈ రికార్డు నిరూపిస్తోంది. రాబోయే మ్యాచ్‌లలో ఆయన మరిన్ని వికెట్లు పడగొట్టి తన రికార్డును మరింత పటిష్టం చేసుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# యువ క్రికెటర్ ప్రశాంత్ వీర్ అరంగేట్రం

చెన్నై సూపర్ కింగ్స్ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఎంఎస్ ధోనీ కనిపించడం లేదు. మరోవైపు పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 20 ఏళ్ల యువ క్రికెటర్ ప్రశాంత్ వీర్ అరంగేట్రం చేశాడు. ప్రశాంత్ వీర్ ఒక ఆల్‌రౌండర్ క్రికెటర్. చెన్నై జట్టులో మాథ్యూ షార్ట్ స్థానంలో అతడికి ఛాన్స్ లభించింది. ఇతడ్ని దృష్టిలో ఉంచుకునే రవీంద్ర జడేజా లాంటి స్టార్ ఆల్ రౌండర్ ను చెన్నై వదులుకుందని టాక్ నడుస్తోంది. గత ఏడాది జరిగిన ఐపటెల్ మినీ వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ ఏకంగా రూ. 14.2 కోట్లు వెచ్చించి ప్రశాంత్ వీర్‌ను తీసుకుంది. ఈ సీజన్లో సీఎస్కే 3 మ్యాచులాడగా రెండింట్లో ప్రశాంత్ వీర్ ప్లేయింగ్ లెవన్ లో ఉన్నాడు. పంజాబ్ తో జరిగిన మ్యాచులో 6 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచులో 29 బంతుల్లో 43 రన్స్ చేసి ఆకట్టుకున్నాడు. ఈ లెఫ్మార్మ్ స్పిన్నర్ కు బౌలింగ్ చేసే అవకాశం ఇంకా రాలేదు. జడేజా ప్రత్యామ్నాయంగా సీఎస్కే మేనేజ్‌మెంట్ ప్రశాంత్ వీర్‌ను భావిస్తోంది. వరల్డ్ క్లాస్ ఆల్ రౌండర్ జడేజాను అతడు రీప్లేస్ చేయగలడా అని సీఎస్కే ఫ్యాన్స్ సైతం ఐపీఎల్ వేలంలో అన్ క్యాప్డ్ ప్లేయర్ ధర చూసి ఆశ్చర్యపోతున్నారు. ప్రశాంత్ వీర్ 2005 నవంబర్ 20న ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలో జన్మించాడు. ఎడమచేతి వాటం ఆఫ్ స్పిన్ బౌలింగ్ చేయడంతో పాటు లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి భారీ షాట్లు ఆడగల సామర్థ్యం ఉంది. యూపీ టీ20 లీగ్‌లో నోయిడా సూపర్ కింగ్స్ తరపున రాణించడంతో ఇతనికి తొలిసారి గుర్తింపు లభించింది. ఆపై సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో కూడా ప్రశాంత్ అత్యుత్తమ ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్నాడు. డొమెస్టిక్ క్రికెట్‌లో యూపీ తరపున ఆడిన ఈ 20 ఏళ్ల యువ క్రికెటర్ 7 మ్యాచ్‌ల్లో 9 వికెట్లు తీయడమే కాకుండా 170 స్ట్రైక్ రేట్‌తో 112 పరుగులు చేశాడు. బ్యాటింగ్‌తో పాటు లెఫ్టార్మ్ ఆఫ్ స్పిన్ బౌలింగ్ చేస్తుండటంతో ఇతడిని చెన్నై సూపర్ కింగ్స్ కొత్త రవీంద్ర జడేజా అని పిలుస్తోంది. ప్రశాంత్ వీర్ గత ఏడాది అక్టోబర్‌లో ఉత్తరప్రదేశ్ తరపున డొమెస్టిక్ క్రికెట్లో అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు 9 టీ20 మ్యాచ్‌ల్లో 9 వికెట్లు తీశాడు. బ్యాటింగ్ లో 112 పరుగులు చేశారు. అలాగే 8 లిస్ట్-ూా మ్యాచ్‌ల్లో 133 పరుగులు చేసి 10 వికెట్లు తీయడంతో సీఎస్కే మేనేజ్ మెంట్ దృష్టిలో పడ్డాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీల్లో రాణించడంతో ఇతనికి ఏకంగా ఐపీఎల్ కాంట్రాక్ట్ లభించింది. అది కూడా అత్యధిక ధర పలికిన అన్ క్యాప్డ్ ప్లేయర్‌గా కార్తీక్ శర్మతో కలిసి 14.2 కోట్లకు లక్కీ ఛాన్స్ కొట్టేశాడు. అవేష్ ఖాన్ 10 కోట్ల (2022) అన్‌క్యాప్డ్ రికార్డును బద్ధలుకొట్టారు. ప్రశాంత్ వీర్ ఉత్తరప్రదేశ్ తరపున ఫస్ట్-క్లాస్ క్రికెట్ లో అడుగుపెట్టినప్పటికీ, రెడ్ బాల్ క్రికెట్‌లో అంతగా రాణించలేదు. 4 ఫస్ట్-క్లాస్ ఇన్నింగ్స్‌ల్లో కేవలం 2 వికెట్లు మాత్రమే తీశాడు. బ్యాటింగ్‌లోనూ యువ సంచలనం అంతగా ఆకట్టుకోలేకపోయాడు.



......

## చట్టం స్పోర్ట్స్

# ధోనీ ఇక ఐపీఎల్‌లో ఎంట్రీకి సిద్ధం



2026 ఐపీఎల్?లో వరుస ఓటములతో తీవ్ర నిరాశ ఉన్న చెన్నై సూపర్ కింగ్స్? ఫ్యాన్స్?కు కాస్త ఊరటనిచ్చే వార్త బయటకు వచ్చింది. మోకాలి గాయంతో ఐపీఎల్ ప్రారంభానికి ముందే రెండు వారాలు ఆటకు దూరమైన స్టార్ బ్యాటర్ మహేంద్రసింగ్ ధోనీ కమ్?బ్యాక్ గురించి కీలక అప్డేట్ వచ్చింది. గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ ఇప్పటికే నెట్స్?లో ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇక ఫిట్?నెస్ టెస్టు ఇచ్చేందుకు ధోనీ సిద్ధమైనట్లు చెన్నై క్రికెట్ వర్గాలు వెల్లడించాయి.గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ ఇక ఐపీఎల్?లో ఎంట్రీ ఇచ్చేందుకు ధోనీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు ధోనీకి ఫిట్?నెస్ జరగనునుంది. అది కూడా ఒకట్రెండు రోజుల్లో ఈ టెస్టు పూర్తయ్యే ఛాన్స్ ఉంది. అతడు వీలైనంత త్వరగా ఫిట్?నెస్ క్లియర్? చేసుకొని మైదానంలో అడుగుపెట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్?లో తమ తదుపరి మ్యాచ్ దిల్లీ క్యాపిటల్స్?తో ఆడనుంది. ఏప్రిల్ 11 (శనివారం) ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ ఉండనుంది. దీంతో ఈ మ్యాచ్?లోనే ధోనీని తీసుకొచ్చేలా చెన్నై మేనేజ్?మెంట్ ఏర్పాట్లు చేస్తుంది. అయితే ధోనీ ఇప్పటికే నెట్స్?లో ప్రాక్టీస్ మొదలు పెట్టేశాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. అందులో ధోనీ కంఫర్ట్?గా కనిపించాడు. దీంతో అతడు ఆర్సీబీతో మ్యాచ్?లోనే ఎంట్రీ ఇస్తాడని ఫ్యాన్స్ భావించారు. కానీ, ధోనీ విషయంలో సీఎస్కే జట్టు యాజమాన్యం ఎటువంటి రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా లేదని, అతడిని మైదానంలో దింపే విషయంలో అసలు తొందరపడకూడదని మేనేజ్?మెంట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అందుకే తొలి మూడు మ్యాచ్?లకు దూరమయ్యాడు. ధోనీ రెండు వారాలు దూరం కానున్నాడని ఈ సీజన్ ప్రారంభానికి ముందే సీఎస్కే ప్రకటించడంతో ఫ్యాన్స్ ఆందోళన చెందారు. కానీ, అదే సమయంలో సంజు శాంసన్ జట్టులోకి రావడం, కుర్రాళ్లతో నిండిన ఫ్రాంచైజీ కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. కానీ అంచనాలను తలకిందులు చేస్తూ సీఎస్కే గత మూడు మ్యాచ్?ల్లో చూపించిన ప్రదర్శన అభిమానులకు నిరాశ కలిగిస్తుంది. తొలి మ్యాచ్?లో రాజస్థాన్?తో ఓడగా, ఇటీవల పంజాబ్ కింగ్స్, తాజాగా ఆర్సీబీ జట్లపై పరాజయం చవిచూసింది. మరి ఇప్పటికైనా చెన్నై ఓటముల బాట వీడి గెలుపు ట్రాక్ ఎక్కాలని అభిమానులు కోరుకుంటున్నారు. ధోనీతోపాటు జట్టు యంగ్ ఆటగాడు డివాల్డ్ బ్రెవిస్ కూడా సీజన్?కు దూరమయ్యాడు. పక్కటెముకల గాయం కారణంగా ప్రారంభ మ్యాచ్?లకు దూరమయ్యాడు. అయితే ఇప్పుడు బ్రెవిస్ కోలుకుంటున్నట్లు తెలుస్తోంది. అలాగే దిల్లీతో మ్యాచ్?లో అతడిని బరిలో దించేందుకు జట్టు మేనేజ్?మెంట్? ప్లాన్ చేస్తోంది. ఈ మేరకు కోచ్ ఫ్లెమింగ్ వెల్లడించారు. ఇక ధోనీ, బ్రెవిస్ రాకతో జట్టులో కొత్త జోష్ రావడం పక్కా!

# చెన్నై బౌన్స్ బ్యాక్ అవ్వగలదా?

ఐపీఎల్ 19వ సీజన్ (2026)లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్థానం ఆందోళనకరంగా మారింది. ఆదివారం రాత్రి బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో 43 పరుగుల తేడాతో ఓటమిపాలై, ఈ సీజన్‌లో వరుసగా మూడవ పరాజయాన్ని మూటగట్టుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆర్‌సీబీ ఆధిపత్యం ముందు రుతురాజ్ గైక్వాడ్ సేన చేతులెత్తేసింది. టాస్ గెలిచిన చెన్నై మొదట బౌలింగ్ ఎంచుకోగా, ఆర్‌సీబీ బ్యాటర్లు చుక్కలు చూపించారు. నిర్ణీత 20 ఓవర్లలో ఆర్‌సీబీ 250/3 పరుగుల భారీ స్కోరు సాధించింది. విరాట్ కోహ్లీ (28) త్వరగా నిష్క్రమించినప్పటికీ, దేవ్‌దత్ పడిక్కల్ (50) మరియు ఫిల్ సాల్ట్ (46) ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. అయితే, అసలు విధ్వంసం చివర్లో మొదలైంది. టిమ్ డేవిడ్ కేవలం 25 బంతుల్లో 8 సిక్సర్లతో 70 పరుగులు చేసి అజేయంగా నిలవగా, రజత్ పటిదార్ (48లి) మెరుపులు మెరిపించారు. వీరిద్దరి ధాటికి చెన్నై బౌలర్లు ఖలీల్ అహ్మద్, అన్షుల్ కాంబోజ్ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. 251 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నైకి ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (7), సంజూ శాంసన్ (9) విఫలమయ్యారు. సర్ఫరాజ్ ఖాన్ (50) అద్భుతమైన అర్ధ సెంచరీతో పోరాడినప్పటికీ, మిగిలిన బ్యాటర్ల నుంచి ఆశించిన సహకారం అందలేదు. శివమ్ దూబే (18), ప్రశాంత్ వీర్ (43), జేమీ ఓవర్టన్ (37) మెరుపులు మెరిపించినా లక్ష్యం చాలా దూరంలో ఉండిపోయింది. ఆర్‌సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 3 వికెట్లతో చెలరేగగా, కృనాల్ పాండ్యా కీలకమైన వికెట్లు పడగొట్టారు. చివరికి చెన్నై 207 పరుగులకు ఆలౌట్ అయింది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోవడం చెన్నై అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. జట్టు ఎంపికలో లోపాలు, కీలక సమయాల్లో వికెట్లు పారేసుకోవడం, డెత్ ఓవర్లలో బౌలర్లు విఫలం కావడం సిఎస్కే పాలిట శాపంగా మారాయి. ముఖ్యంగా గైక్వాడ్, సంజూ శాంసన్ వంటి అగ్రశ్రేణి బ్యాటర్లు నిలకడ లేమితో ఇబ్బంది పడుతున్నారు.లీగ్ ఆరంభంలోనే వరుస ఓటములతో చెన్నై ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది. అయితే, ఐపీఎల్ చరిత్రలో చెన్నైకి ఇటువంటి పరిస్థితులు కొత్తేమీ కాదు. గతంలో కూడా తక్కువ పాయింట్లతో ఉండి



ప్లే-ఆఫ్స్‌కు చేరిన సందర్భాలు ఉన్నాయి. కానీ, ఈసారి పోటీ చాలా తీవ్రంగా ఉండటం మరియు జట్టు సమతూకం లోపించడంతో పునరాగమనం అంత సులభం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. తదుపరి మ్యాచ్‌లలో గెలవాలంటే బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు మరియు డెత్ బౌలింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# సంజూ రాకతో సీఎస్‌కేకి శని పట్టుకుందా?

ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ పరిస్థితి ఏమీ బాగోలేదు. వరుసగా మూడు మ్యాచుల్లో ఓడిపోయి పాయింట్ల పట్టికలో అట్టడుగున పడిపోయింది. అయితే, ఈ ఓటముల కంటే ఇప్పుడు సీఎస్‌కే అభిమానులను ఎక్కువగా బాధిస్తున్న విషయం.. స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ ఫామ్. రాజస్థాన్ రాయల్స్ నుంచి భారీ అంచనాల మధ్య ట్రేడింగ్ ద్వారా చెన్నైలోకి అడుగుపెట్టిన సంజూ, వరుసగా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం కావడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఓ రేంజ్‌లో ఫైర్ అవుతున్నారు. మొన్నటి టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ విజేతగా నిలవడంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించాడు. ప్రపంచ స్థాయి బౌలర్లను తన బ్యాటింగ్‌తో భయపెట్టిన సంజూ, ఇప్పుడు ఐపీఎల్‌లో మాత్రం చేతులెత్తేస్తున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడిన మొదటి మూడు మ్యాచుల్లో అతను చేసిన స్కోర్లు వరుసగా 6, 7, 9. అంటే మొత్తం మీద మూడు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 22 పరుగులు మాత్రమే చేశాడు. వరల్డ్ కప్ గెలిచిన ఊపులో ఐపీఎల్‌ను ఊపేస్తాడని భావించిన అభిమానులకు సంజూ ఆటతీరు తీవ్ర నిరాశను కలిగిస్తోంది. సంజూ కేవలం పరుగులు చేయకపోవడమే కాదు, మైదానంలో అతని ప్రవర్తన కూడా చర్చనీయాంశంగా మారింది. చెన్నై జెర్సీలో సంజూ అస్సలు సంతోషంగా కనిపించడం లేదని, ఏదో అయిష్టంగా ఆడుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజస్థాన్ రాయల్స్ మాజీ కెప్టెన్‌గా సంజూలో ఉన్న ఆ కసి, ఆకలి ఇప్పుడు చెన్నైలో కనిపించడం లేదని ఫ్యాన్స్ అంటున్నారు. ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తో జరిగిన మ్యాచ్‌లో కూడా సంజూ త్వరగా అవుట్ కావడంతో సోషల్ మీడియాలో స్టెప్ అసైడ్ సంజూ(సంజూ తప్పుకో) అనే హ్యాష్‌ట్యాగ్ వైరల్‌గా మారింది. ఒక చెన్నై అభిమాని ఎక్స్‌లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది. "ప్రియమైన సంజూ.. నీవు మానసికంగా ఈ టీమ్‌తో కనెక్ట్ కాలేకపోతే, దయచేసి కొన్ని మ్యాచులు పక్కన కూర్చో. మైదానంలో కెమెరా నీవైపు తిరిగిన ప్రతిసారీ నువ్వు అసహనంగా కనిపిస్తున్నావు. నీలో ఆ గెలుపు కసి, వేగం ఎక్కడ పోయాయి? కనీసం నువ్వు టీమ్ కోసం ఆడుతున్నావు అన్నట్లుగా అయినా నీ బాడీ లాంగ్వేజ్ ఉండాలి కదా" అంటూ తీవ్రంగా స్పందించారు. శాంసన్ కేరళ కుర్రాడు కావడంతో సౌత్ లో అతనికి ఉన్న విపరీతమైన క్రేజ్, ఇప్పుడు నెగటివ్ గా మారుతోంది. బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ విఫలమైంది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. ట్రిమ్ డేవిడ్ (70), దేవదత్ పడిక్కల్ (50), రజత్ పాటిదార్ (48) మెరుపు ఇన్నింగ్స్‌లతో 250 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో చెన్నై మొదట్లోనే తడబడింది. టాప్ ఆర్డర్ కుప్పకూలడంతో కేవలం 30 పరుగులకే కీలక వికెట్లు కోల్పోయింది. చివర్లో సర్ఫరాజ్ ఖాన్ (50), ప్రశాంత్ వీర్ (43) పోరాడినా.. చెన్నై 207 పరుగులకే పరిమితమై 43 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. వరుస ఓటములతో సతమతమవుతున్న చెన్నైకి సంజూ ఫామ్ ఇప్పుడు పెద్ద తలనొప్పిగా ..... మారింది.



Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999